ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

డిసెంబర్ 2019

సంపుటి : 25 **300** సంచిక : 12

ఒకే దేశం, ఒకే మతం, ఒకే కులం!

ఓమ్ యో బ్రహ్మాణం విదధాతిపూర్వం
యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై!
తం హ దేవమాత్మ బుద్ధి ప్రకాశం
ముముక్షుర్వై శరమహం ప్రపద్యే!

సృష్టికి పూర్వం సృష్టికర్తయగు బ్రహ్మ నెవరు సృష్టించారో, ఎవరు ఆ బ్రహ్మదేవునికి వేద సంపద నొసంగారో, అట్టి తేజో మూర్తినీ, బుద్ధిని ప్రకాశింపచేయువాడగు పరమాత్మనూ నేను శరణు వేడుతుంటాను అనే ధ్యాన, అధ్యయన, ఆరాధనా సిద్ధాంతం కలదీ భారతవర్షం భారతదేశం.

'ఈశావాస్య మిదం జగత్' అన్నారు. సర్వే సర్వత్రా భగవంతు డున్నాడన్నారు; సచ్చిదానందములో ఉన్నాడన్నారు. అసలు సచ్చిదానందం ఎక్కడున్నది! **త్యజ దుర్జన సంసర్గం – ఏకాత్మా సర్వభూతాంతరాత్మ** – దుర్జనుల్ను త్యజించు – అన్ని ప్రాణుల్లోనూ భగవంతుడున్నాడని గ్రహించు. **ఏకం సత్‌విప్రాః బహుధా వదంతి** – ఇలాటి మధుర సూక్తుల నెన్నిటినో ఇలాతలంలోనికి ప్రవేశపెట్ట బడినదీ, ప్రబోధించినదీ భారత దేశం, భారతవర్ష పూర్వులే!

దైవం మనుష్య రూపంలో ఉన్నాడంటూ **'దైవం మానుష రూపేణా'** అన్నారు. సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్' అన్నారు. పురుషుడైన భగవంతునికి వేల కొద్దీ శిరస్సులూ, వేలకొద్దీ నేత్రములూ, పాదములూ, హస్తములూ ఉన్నాయనడంలో కల భావం భగవంతుడు అందరిలోనూ ఉన్నాడనే అర్థం యిస్తున్నది.

ఆయనకు మతం, కులం, వర్గం భాషా వంటి వ్యత్యాసములు లేవు. భారతదేశంలో ఆరున్నర వేలకు పైగా కులాలూ, ఉపకులాలూ, పదహారు వందలకు పైగా చిన్నచిన్న భాషలు మాట్లాడే ప్రదేశాలూ, 28 రాష్ట్రాలూ, 7 కేంద్రపాలిత ప్రాంతాలూ ఉన్నప్పటికినీ ఏకత్వంలో భిన్నత్వంగాను, భిన్నత్వంలో ఏకత్వంగాను దేశం విలసిల్లుతూంది. ఏకదేశంగా వరలతూ వచ్చింది. **'క్షమా ధరిత్రీ'** అన్నట్టు ఎందరెన్ని దండయాత్రలు చేసినప్పటికినీ భరతభూమి ఓర్మి వహించింది. వారందర్నీ భారతవాసులుగానే, భారతీయులుగానే, కన్నబిడ్డలుగానే భావించింది. అలాటి భారతదేశంలో జన్మించిన బిడ్డల్ను భారత పౌరులుగా భావించి, భారతదేశ ఔన్నత్యానికి శ్రమించవలసిన తరుణం వచ్చింది. తరతమ బేధాలను విడనాడి, భారతీయులుగానే ఆచంద్రతారార్కమూ ఆలుబిడ్డలతో వర్థిల్లాలి గానీ, అంతర్యుద్ధంతో ఒకరి నొకరు హింసించడం సంహరించుకోవడం సమంజసం కాదని ప్రముఖాంధ్ర హితోక్తి పలుకుతూంది. కొత్తతరం వారిలోనైనా **ఒకే దేశం, ఒకే మతం, ఒకే కులం** అనే నినాదాన్ని జయధ్వానంగా పలికింపచేయడం మంచిది. 'భారతి' అంటే సరస్వతి. ఆ సరస్వతి జ్ఞాన సరస్వతి. అలాటి భారతీ నామకరణం గల భారతదేశంలో సమస్త ప్రాణికోటీ సమైక్యతతో జీవించవలసిన తరుణం వచ్చిందని సర్వులూ గ్రహించాలనీ, సర్వేశ్వరుడు అనుగ్రహించాలనీ ప్రముఖాంధ్ర కోరుకుంటూంది.



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

(సెప్టెంబర్ 2002, ప్రముఖాంధ్ర)

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

ధనుర్మాసము - గోదామాత ఆరాధన

సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించే కాలాన్ని ధనుర్మాసము అంటారు. మాసాల్లో మార్గశిర మాసాన్ని నేను... అని చాటి చెప్పిన పరమాత్మకు ఈ మాసంలో వచ్చే ధనుర్మాసమంటే కూడా ఎంతో ప్రీతి. దక్షిణాయనమునకు చివరిది, ఉత్తరాయణమునకు ముందుది ఐన ధనుర్మాసం ప్రాతఃకాలము లాగే పవిత్రమైనది. సాత్వికమైన ఆరాధనలకు ఈ మాసం ప్రధానమైనది కనుక, సత్వగుణ ప్రధానమైన విష్ణువును ఈనెలలో ఆరాధిస్తారు. ధనుర్మాసం ఏటా డిసెంబరు రెండో పక్షంలో ప్రారంభమై జనవరి మొదటి పక్షంతో ముగుస్తుంది. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే మకర సంక్రమణం వరకు (సంక్రాంతి) వరకు కొనసాగే ధనుర్మాసం నెల రోజులూ, ప్రతి ఇంటి ముందు వేకువజామునే గోమయంతో కళ్లాపి చల్లి, ముగ్గులు వేసి, వాటిపై ఆవుపేడతో చేసిన గొబ్బిళ్లను ఉంచి, వాటిని గుమ్మడి, బంతిపూలతో అలంకరిస్తారు. ఇంటి ముంగిట లోగిళ్లలో అలంకరించిన రంగవల్లులు, గొబ్బిళ్లు లక్ష్మీదేవికి స్వాగతం పలుకుతాయనేది ఒక విశ్వాసం.

తిరుమలలో ధనుర్మాసం నెలరోజులు, సుప్రభాతం బదులు తిరుప్పావై గానం చేస్తారు. సహస్రనామార్చనలో తులసీదళాలకు బదులు బిల్వపత్రాలను ఉపయోగిస్తారు. శయన బేరంగా ఈ ధనుర్మాసంలో రజిత శ్రీకృష్ణస్వామిని అర్చిస్తారు. ఇది తిరుమలలో జరిగే సంప్రదాయం. విష్ణు ఆలయాలలో ఉదయం పూట అర్చనలు చేసి, నివేదనలు చేసి వాటిని పిల్లలకు పంచుతారు. దీనిని బాలభోగం అని పిలుస్తారు. ఈ మాసంలో పెళ్ళికాని కన్నె పిల్లలు మంచి భర్త లభించడం కోసం 'కాత్యాయని వ్రతం' చేస్తారు. ఈ ధనుర్మాస వ్రతం గురించి మొదట బ్రహ్మదేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనం. ధనుర్మాస వ్రతానికి సంబంధించిన అంశాలు బ్రహ్మాండ, ఆదిత్య పురాణాల్లో, భాగవతంలో, నారాయణ సంహితలో కనిపిస్తాయి. ధనుర్మాసానికి ఇంతటి విశిష్టతను కల్పించిన గోదామాత జన్మ వృత్తాంతాన్ని ఇప్పుడు తెలుసుకుందాము.



కోదై - గోదా జన్మ వృత్తాంతం

తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు అనే ఒక గ్రామంలో భట్టనాథుడు అనే భక్తుడు ఉండేవాడు. ఆయన నిరంతరం విష్ణుమూర్తిని గురించే చింతిస్తూ ఉండడం వలన ఆయనను అందరూ 'విష్ణుచిత్తుడు' అని పిలిచేవారు. ఆయన దివ్య మంగళమైన విష్ణు స్వరూపాన్ని కనులారా దర్శించి, తరించిన ధన్యజీవి. ఆయన భక్తితో మంగళాశాసనములను రచించి, విష్ణుమూర్తికి అంకితమిచ్చారు. అందుకే అంతా ఆయనను 'పెరియాళ్వార్ '(పెద్ద విష్ణు భక్తుడు) అనేవారు. విష్ణుచిత్తుడు భగవంతుని ఆజ్ఞతో పాండ్య దేశపు సభకు వెళ్ళి, తత్వ నిర్ణయంచేసిన మహనీయుడు. అందుకే ఆ పాండ్య రాజు ఆయనని ఏనుగు అంబారి పై ఊరేగించి 'బట్టర్పిరాన్' అని బిరుదిచ్చారు. ఆ రాజుద్వారా ఆందిన సంపదను కూడా విష్ణుచిత్తుడు, శ్రీవిల్లిపుత్తుర్ ఆలయ గోపురం, ప్రాకారాదులకు కైకర్యంగా వినియోగించారు. అంతటి పరమ భాగవతుడాయన.

ఒకరోజున విష్ణుచిత్తుడు తులసీ ప్రియుడైన శ్రీహరికై తులసి వనం పెంచాలని అనుకొని, పాదులు తవ్వేందుకై పాతర తీస్తూ ఉండగా, ఆయనకు భూమిలో ఒక పెట్టె దొరికింది. ఆ పెట్టెలో ఒక ముద్దులొలికే చిన్నారి బాలిక కనిపించింది. ఆమెను తన కుమార్తెగా స్వీకరించి, ఆయన పెంచసాగారు.

తమిళంలో తులసి మాలను 'కోదై' అంటారు. ఆ బాలికను కూడా స్వామివారి పూజకు జన్మించిన మాలికగా భావించి, ఆమెకు అదే పేరును పెట్టాడు విష్ణుచిత్తుడు. క్రమంగా అదే 'గోదా'గా మారిందని అంటారు.

సాధారణ బాలికలా కనిపిస్తున్నా, గోదా నిజానికి బాలిక కాదు, స్వయానా హరికి ప్రేమిక. ఆమె బాల్యం నుంచి ఆ నీలిమేఘశ్యాముడినే మనసులో నింపుకుంది. కృష్ణ లీలను గానం చేస్తూ, ఆడి పాడేది. తన్మయత్వంతో ఎల్లప్పుడూ కృష్ణుడిని ఆరాధిస్తూ ఉండేది. ఆ శ్రీవిల్లిపుత్తూరునే గోకులంగా భావించేది, తన చెలులనే తోటి గోపికలుగా భావించేది, తన ఇంటినే కృష్ణ భవనంగా భావించేది, తననొక గోపికగా తలచి, అద్దంలో తన రూపంలో కృష్ణుడినే చూసుకునేది. కృష్ణుడి కోసం తండ్రి అల్లిన తులసి మాలలను ముందుగా తాను ధరించి, బావిలో చూసుకుని, మురిసిపోయి, ఆపై మళ్ళీ యధాతధంగా పెట్టేసేది. అందుకే ఆమె 'ఆముక్త మాల్యద' అయింది.

ఒకరోజున తులసిమాలలో ఒక వెంట్రుక రావడంతో విష్ణుచిత్తుడు ఆశ్చర్యపోయాడు. తన కూతురు స్వామివారికి అల్లిన మాలలను ధరించడం చూసిన విష్ణుచిత్తుడు, అలా చెయ్యడం అపచారమని తన కుమార్తెను మందలించాడు. కాని ఆరోజున రాత్రి ఆయనకు కలలో స్వామివారు కనిపించి, గోదా ఆ విధంగా తాను వేసుకుని తీసి ఇచ్చిన మాలలే, తనకు ఇష్టమని, వాటితోనే తనను అలంకరించమని చెబుతారు. దానితో గోదాదేవి సాధారణ బాలిక కాదని, తనపై దయతో, తనను అనుగ్రహించడానికి మానవాకృతి దాల్చి వచ్చిన అమ్మవారని తెలుసుకున్న విష్ణుచిత్తుడు అప్పటి నుంచి ఆమెను ప్రేమగా 'ఆండాళ్' (భక్తులను కాపాడేందుకు వచ్చినది) అని పిలవసాగాడు.

ఇలాంటి సంఘటనలన్నీ గోదా మనసులో

కృష్ణప్రేమని మరింతగా పెంచాయి. తనకు పెళ్లంటూ జరిగితే ఆయనతోనే జరగాలని అనుకుంది. యుక్తవయసుకు వచ్చిన గోదాదేవి, కృష్ణుడినే తన భర్తగా భావించి, ఆయనను పొందేందుకు తన నెచ్చెలులతో కలిసి, ఒకప్పుడు గోపికలు శ్రీకృష్ణుడిని పొందేందుకు చేసిన 'కాత్యాయని వ్రతం' చేసింది.

'కాత్యాయని' అంటే ఎవరు?

కాత్యాయని అంటే కృష్ణ సహోదరి. కృష్ణుడు జన్మించే సమయంలో కంసుడిని భ్రమియింప చేసిన యోగమాయ. ఈమెను వివాహం కాని స్త్రీలు ఈ మంత్రంతో పూజిస్తే మంచి భర్త లభిస్తాడని ప్రతీతి.

"కాత్యాయని మహామాయే మహాయోగిన్యధీశ్వరి
నందగోప సుతం దేవం పతిం మే కురుతే న్నమః"

భావం : మహామాయగా అవతరించిన కాత్యాయని, నీవు మహా యోగినివి. అమ్మా, నీకు నమస్కరిస్తున్నాను. నందుడి సుతుడు, గోప బాలుడైన కృష్ణుడి వంటి భర్తను నాకు అనుగ్రహించు.

మధుర భక్తికి నిదర్శనంగా నిలిచే ద్వాపరయుగ వ్రజగోపికలు శ్రీకృష్ణుని పొందగోరి "కాత్యాయని" వ్రతాన్ని ఆచరించి ఆ స్వామిని ఎలా పొందారో, అలాగే కలియుగంలో గోదాదేవి కూడా ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి, శ్రీహరిని తనవానిగా చేసుకొన్నపుణ్యమూర్తి.

కాత్యాయనీ వ్రతం చేయాలంటే ఆహారానికీ, అలంకారానికీ సంబంధించిన చాలా కఠినమైన నియమాలని పాటించాల్సి ఉంటుంది. అలా గోదాదేవి తాను వ్రతాన్ని పాటించడమే కాకుండా తన చెలికత్తెలని కూడా ప్రోత్సహించింది. తన స్నేహితురాళ్లను మేలుకొలిపేందుకు, వారికి వ్రత విధానాలను తెలియచేసేందుకు, తనలో కృష్ణభక్తిని వెల్లడించేందుకు 30 పాశురాలను పాడింది గోదా. అవే ధనుర్మాసంలో ప్రతి వైష్ణవభక్తుని ఇంట్లోనూ వినిపించే తిరుప్పావై!

గోదాదేవి మార్గళి వ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసమంతా పూజించింది. వయో లింగబేధాలు లేకుండా ఎవరైనా ఈ వ్రతాన్ని జరుపుకోవచ్చుంటారు . ఇందులో రామాయణ, భారత సారాంశం ఉంది. అంతర్లీనంగా శ్రీవైష్ణవతత్వం, ఉపనిషత్ రహస్యాలు ఉన్నాయి. తిరుప్పావై అంటే శ్రీవ్రతమని చెప్పవచ్చు. అందులో వేదాంతముంది, రస పిపాస ఉంది, గోకులముంది, తమిళ దేశముంది. కాళిదాసును మించిన అసమానమైన ఉపమానాలతో ఏది శ్రీవిల్లి పుత్తూరో, ఏది రేపల్లెనో విడదీసి చూపలేనంతగా అమ్మవారే స్వయంగా రాసిన అద్భుత కావ్యమిది.

శ్రీకృష్ణునికి ధనుర్మాసం నెలరోజులూ తులసీమాల సమర్పించే యువతులకు, నచ్చిన వరునితో వివాహం జరుగుతుంది. ఈ వ్రతం ఆచరించుకోవాలనుకునేవారు శక్తిమేరకు విష్ణుప్రతిమని తయారుచేయించి, పూజాగృహంలో ప్రతిష్ఠించుకోవాలి. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు లేచి, స్నానాదికాలు ముగించాలి. పంచామృతాలతో శ్రీమహావిష్ణువును అభిషేకించాలి. తర్వాత తులసీ దళాలు, పూలతో అష్టోత్తర సహస్రనామాలతో స్వామిని పూజించి నైవేద్యం సమర్పించాలి.

ఈ నెలరోజులూ విష్ణుకథలను చదవటం, తిరుప్పావై పఠించటం చెయ్యాలి. నెలరోజులూ చెయ్యలేనివారు పదిహేను రోజులు, 8 రోజులు లేదా కనీసం ఒక్కరోజైనా ఆచరించవచ్చు. వ్రతాచరణ తర్వాత బ్రహ్మచారికి దానమిచ్చి, ఆశీస్సులు అందుకోవాలి. గోదాదేవి తన పాశురాలలో చివరి పాశురంలో సూచించిన విధంగా ఈ తిరుప్పావై పారాయణ చేసిన వారికి, తిరుప్పావై గాన, శ్రవణం చేసిన వారికీ ఆయురారోగ్య అష్టైశ్వర్య ముక్తి ప్రదాయకం కాగలదు.

ఆండాళ్ దివ్య ప్రబంధాలు - తిరుప్పావై

శ్రీరంగనాథున్ని వివాహమాడుటకై తాను "తిరుప్పావై" మరియు "నాచియార్

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

b-d

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

తిరుమొళి" అనే దివ్యప్రబంధాలను పాడెను. ఆమె తిరుప్పావై (30 పాశురములు), నాచ్చియారు తిరుమొళి (143 పాశురములు) జగత్ విఖ్యాతమై అందరి చేత నుతింపబడుచున్నవి. 'తిరు' అంటే శ్రీ అని, 'పావై' అంటే పాటలు లేక వ్రతం అని అర్థం. కలియుగంలో మానవకన్యగా జన్మించి గోదాదేవిగా ప్రఖ్యాతమైన ఆండాళ్ భగవంతుడినే తన భర్తగా భావించి, ఆయన్ను చేపట్టడానికి సంకల్పించిన వ్రతమే తిరుప్పావై వ్రతం. తిరుప్పావైలో 'పాశురాలు' – అంటే ఛందోబద్ధంగా ఉన్న పాటలు ఉంటాయి.

పాశురమంటే ఎనిమిది పంక్తుల గీతం. అచ్చతమిళం, సెందమిళంలో చెప్పిన కవిత్వమిది. దానికొక నిర్మాణ క్రమముంది. మొదటి అయిదు పాశురాలూ నోము నోచడానికి చెప్పుకున్న సంకల్పం. 6వ పాశురం నుంచి 15వ పాశురం దాకా కన్యలు ఒకరినొకరు పిలుచుకోవడం, ఇంటింటికీ తిరగడం, ఒకరినొకరు మేల్కొల్పుకోవడం, మిత్రురాళ్లు చేరువకావడం వర్ణించబడింది. 16వ పాశురం నుంచి 29వ పాశురం దాకా కావ్యంలోని సారాంశమంతా ఉంది. అది కన్యలు శ్రీవిల్లి పుత్తూరులోని శ్రీ కృష్ణ దేవుని దేవాలయం ముందు చేరి దేవుణ్ణి మేల్కొల్పే కవిత్వం. 26వ పాశురంలో మంగళవాద్యం కోసం మొక్కుకున్న గోదా, 27వ పాశురానికి వచ్చేటప్పటికి తిరుప్పావై వ్రత ప్రయోజనమేమిటోచెప్పింది. ఇవి మాములు పాటలు కావు, సర్వ వేద సారమని చెప్పవచ్చు.

కాని, తిరుప్పావై రాసి పాడినా, కాత్యాయని వ్రతం చేసినా ఇంకా గోదామాతకు భగవంతుని దర్శనం కల్గలేదు, అప్పుడు తన వేదనని తెలియజేస్తూ 'నాచియార్ తిరుమొళ్లి' అనే మరొక నూట నలభై మూడు పాటల దివ్య ప్రబంధాన్ని ఆమె పాడింది. అప్పుడు అర్చామూర్తిగా ఉన్న రంగనాథుడు చలించి, తన వద్ద ఉన్న అర్చకుడిని ఆదేశించి గోదాదేవిని శ్రీవిల్లిపుత్తూర్ నుండి పిలిపించుకుని, శ్రీరంగ క్షేత్రంలో రంగవిళాస మండపంలో మానవ కన్యగా ఉన్న ఆమెను వివాహమాడాడు.

'నాచ్చియార్ తిరుమొళి' మొత్తం పధ్నాలుగు పాశురాల కావ్యం. ఒక్కొక్క పాశురంలో పది లేదా పదకొండు చొప్పున మొత్తం 143 పద్యాలు. ప్రగాఢమైన, భావోద్దీపకమైన, ఆత్మనివేదనం ఈ కావ్యంలో కనిపిస్తుంది. ఒక బాలికగా కృష్ణుడిని ఆరాధించిన గోదా, ఈ కావ్యంలో ప్రౌఢగా తన విరహ వేదనను స్వామికి నివేదిస్తుంది.

గోదా కల్యాణం

వైష్ణవులకు 108 దివ్య తీర్థాలు ఉంటాయి. అందులో మూడు ముక్తిని పొందిన భాగవతులు దేహాన్ని విడిచాకా దర్శిస్తారని అంటూ ఉంటారు. తన తండ్రి అయిన విష్ణుచిత్తుడి ద్వారా ఈ దివ్య తీర్థాలను గురించి తెలుసుకున్న గోదా శ్రీరంగనాథ స్వామియే తన భర్త అని తీర్మానించుకుంది. ఆయననే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది.

తాను ఎంతటి భాగవతుడైనా, ఆమె కారణ జన్మురాలని తెలిసినా, ఒక తండ్రిగా విష్ణుచిత్తుడి మనసులో తన కుమార్తె వివాహం గురించి బెంగ పట్టుకుంది. అప్పుడు విష్ణుచిత్తుడికి శ్రీరంగనాథస్వామి మళ్ళీ స్వప్నంలో కనిపించి, 'నీ కుమార్తె ఎవరో కాదు భూదేవేనని, ఆమెను తనకిచ్చి వివాహం జరిపించమని చెబుతారు.

శ్రీరంగంలోని దేవాలయ పెద్దలకు కూడా స్వామి స్వప్నంలో కనిపించి, తన వివాహమునకై శ్రీవిల్లిపుత్తూర్ నుండి గోదాదేవిని పల్లకీలో తీసుకురమ్మని ఆజ్ఞాపించారు. స్వామివారి నుంచి సందేశం అందుకున్న విష్ణుచిత్తుడు, ఆనందంగా గోదాదేవితో సహా శ్రీరంగం ప్రయాణమవుతాడు. వారికి ఎదురొచ్చిన రాజు వల్లభ దేవునితో పాటు అందరూ కలిసి గోదాదేవిని రంగనాథుని వద్దకు తీసుకు వెళ్లారు.

'ఒక మనిషి, దేవుడి ప్రతిమను పెళ్లి చేసుకోవడం ఏమిటి? ఇటువంటి వింతను ఎప్పుడూ చూడలేదే! ఇదేమి చిత్రం?' అనుకుంటూ శ్రీరంగంలోని ప్రధాన వీధిలో ఈ చోద్యాన్ని చూసేందుకు జనులు బారులు తీరారు. అందుకే ఆ వీధికి 'చిత్రవీధి' అనే పేరు వచ్చింది.

అందరూ చూస్తుండగానే, వివాహం ముగిసిన మరుక్షణం గోదా దేవి స్వామి సన్నిధానంలో చేరిపోయింది. రంగనాథుడిని వరించి, 'రంగనాయకి' అయ్యింది. విష్ణుచిత్తుడు 'అయ్యో నా గోదా ఏది?' అని విలపించసాగాడు. విగ్రహం నుంచి రంగనాథుడి వాణి ఆయనతో 'భక్తా, విలపించవలదు. మీరు మీ వూరికి వెళ్ళే లోపల నేను గోదా దేవితో పాటు అక్కడికి వస్తాను,' అని వినిపించింది. విష్ణుచిత్తుడు శ్రీవిల్లిపుత్తూర్ చేరగానే స్వామి రంగమన్నార్, అంటే రంగరాజుగా గరుడవాహనంపై గోదాదేవితో కల్సి వేంచేసాడు. శ్రీవిల్లిపుత్తూరులో అసలు దేవాలయం వటపత్ర శాయిదే, కాని గోదాదేవి రంగనాథుడిని పొందాక, గోదాదేవి ఆలయం తర్వాత ప్రసిద్ధి చెందినది. ఆ ప్రక్కన గోదాదేవి నివసించే ఇల్లు ఆమె మందిరంగా ఈనాటికి కూడా మనకు కనిపిస్తుంది. ఆ గోదాదేవి అలా సాక్షాత్తు లక్ష్మీదేవి స్వరూపంగా అవతరించి, స్వామిని వరించి, ఈ భూమినంతా తరింపజేసింది.

గోదాదేవి – మధుర భక్తిమార్గం

గోదాదేవిని 12 మంది ఆళ్వారులలో చేర్చి, 'ఆండాళ్' గా పిలుస్తారు. ధనుర్మాసంలో ఆమె ప్రతిరోజు రచించి పాడిన తిరుప్పావై పాశురములు జగత్ విఖ్యాతినంది అన్ని వైష్ణవదేవాలయాలలోను మారుమ్రోగుతూ ఉంటాయి. ఇతర దేవీ స్వరూపాలతో పోలిస్తే, గోదాదేవికి ఒక విశిష్టత ఉంది.

జీవుల గమ్యం జంతుత్వం నుంచి మానవత్వానికి, మానవత్వం నుంచి దైవత్వానికి పరిణితి చెంది, చివరికి జీవాత్మ పరమాత్మలో లయమవ్వడమేనని చెబుతారు. కాని, ఆ దైవాన్ని చేరే, వరించే మార్గాన్ని మనకు ఏ ఇతర దేవతలు ఆచరించి చూపలేదు. వీరికి భిన్నంగా గోదాదేవి మనిషిగా అవతరించి, పరమాత్మను తన మధుర భక్తితో వశం చేసుకుంది. అంతేకాక, మనవంటి సాధారణ మానవులు తరించేందుకు మనకు 'తిరుప్పావై' అనే అమృత కలశాన్ని అందించి వెళ్ళింది. జపతపాలకు, మంత్రతంత్రాలకు లొంగని పరమాత్మ కేవలం నిష్కల్మషమైన నిండు భక్తికి కట్టుబడతాడని గోదాదేవి గాథ మనకు నిరూపిస్తుంది. జీవాత్మలుగా ఉన్న మనం లింగాభేదాలకు అతీతంగా ఆ పరమాత్మనే మన సర్వస్వంగా భావించి, తపించి, ప్రేమిస్తే, గోదామాతలా మనమూ ఆయన సన్నిధిని చేరడం తథ్యం.

జై శ్రీమన్నారాయణ!

Beautiful City - Beautiful Hotel

DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని – చెన్నై

గురు

మన జాతీయ చిహ్నం అయిన నాలుగు సింహాలలో మనకి మూడు మాత్రమే కనిపిస్తాయి. నాలుగో సింహం ఎన్నడూ కనిపించదు. అదే విధంగా తెర చాటున వుండి ముందుకి రాకుండా కీలక పాత్ర పోషించేవారు కొందరు వుంటారు. వీరికి పబ్లిసిటీ ఇష్టం వుండదు. కానీ వెనుక వుంటూ కీలక పాత్రని పోషిస్తూవుంటారు. వీరిలో కొందరు మన జీవితాలనే ప్రభావితం చేస్తారు. అటువంటి వారిలో మా "గురు" ఒక్కడు. M.S. గురుమూర్తి (మండలం సుబ్రహ్మణ్యం గురుమూర్తి) 1970 నుంచి ఇప్పటివరకు దాదాపు ఐదు దశాబ్దాలు ఒకవైపు క్రికెట్ టోర్నమెంట్స్‌ని, మరో వైపు లెక్కల ట్యూషన్ క్లాసులని రెండు చేతులతో సవ్యసాచిలాగా చాకచక్యంగా, సమర్థవంతంగా, మద్రాసులోని టీ.నగర్‌లో నడిపిస్తున్న వ్యక్తి మా గురు.

టీ నగర్ లోని సోమ సుందరం గ్రౌండ్ పేరు చెబితే ఎవరైనా వెంటనే గురు టీం అనే వారు. గురు టీంలో పదేళ్ళ పిల్లల నుంచి పాతిక ముప్పై ఏళ్ళ యువకులవరకు అంతా వివిధ రకాల టీంలలో క్రికెట్ ఆడేవారు. A, B టీంలు క్రికెట్ మాట్, నెట్, కార్క్ బాల్, పూర్తి కిట్‌తో క్రికెట్ ఆడేవారు. C, D టీంలు టెన్నిస్ బాల్‌తో ఆడేవారు. సాయంత్రం ఐదు గంటలనుంచి ఆరున్నర వరకు రోజూ క్రికెట్ ప్రాక్టీసు వుండేది. ఆదివారాలు కొన్ని సార్లు క్రికెట్ మాచ్ లు పెట్టేవారు. మా Y.S.C.A. (Young Stars Cricket Association) Tournaments అంటే ఆ రోజుల్లో చాలా గొప్పగా చెప్పుకునే వారు. మా టోర్నమెంట్స్ వేసవి శలవల్లో మా రామకృష్ణ స్కూల్ ప్లే గ్రౌండ్ (న్యూ గ్రౌండ్)లో జరిగేవి. మా ప్లే గ్రౌండ్ టీ నగర్ లోని G.N. Chetty (గోపతి నారాయణ చెట్టి) వీధిలో వుంది. కేవలం తమిళనాడు నుంచే కాకుండా చుట్టుపక్కల రాష్ట్రాలనుంచి కూడా క్రికెట్ టీంలు ఈ పోటీల్లో పాల్గొనేవి. బ్రిజేష్ పటేల్, T.E. శ్రీనివాసన్, మైఖేల్ దాల్వి వంటి జాతీయ క్రికెట్ క్రీడాకారులు, మరెందరో ప్రఖ్యాతి గాంచిన రాష్ట్ర క్రికెట్ క్రీడాకారులు (అబ్దుల్ జబ్బార్, నటరాజన్, ధర్మలింగం, తదితరులు) ఈ పోటీలలో పాల్గొనేవారు. ఇదికాకుండా మా గురు టీం నుంచి Rising Stars పేరున ఒక టీం T.N.C.A. లీగ్ మాచెస్‌లో పాల్గొనేది. 1982–83 లో భారత క్రికెట్ జట్టులో ఫాస్ట్ బౌలర్ గా ఆడిన T.A. శేఖర్ 1960–70 లో మా గురు టీంలో ఆడేవాడు.

మా గురు తన స్వంత డబ్బులు ఖర్చు పెట్టి మరీ క్రికెట్ టీం నడిపేవాడు (ఇంకా నడిపిస్తున్నాడు). ఆ రోజుల్లో తలా పది రూపాయలు నెలకి ఇచ్చేవాళ్ళం. ఈ పది రూపాయలు ఇచ్చేవాళ్ళకన్నా, ఇవ్వని వాళ్ళే ఎక్కువమంది ఉండేవారు. అయినా గురు ఏమీ అనేవాడు కాదు. మా రామకృష్ణ స్కూల్‌కి క్రికెట్ కోచ్‌గా కూడా మా గురు రెండు దశాబ్దాల పైచిలుకు సేవలు అందించాడు. ప్రతీ క్రీడాకారుడిని పేరు పెట్టి ఆప్యాయంగా పిలిచేవాడు మా గురు.

గురు లెక్కల ట్యూషన్ చెప్పేవాడు. ట్యూషన్ అనటం కన్నా ఫ్రీ కోచింగ్ అనటం సబబుగా వుంటుంది. ఉదయం ఏడు గంటలనుంచి ఎనిమిదిన్నర వరకు, సాయంత్రం ఏడు గంటలనుంచి తొమ్మిది గంటల వరకు రోజూ లెక్కల క్లాసులు చెప్పేవాడు మా గురు. దాన్ని లెక్కల ట్యూషన్ అనటం కన్నా అవధానం అనటం సముచితంగా వుంటుంది. చుట్టూ కనీసం పది, పదిహేను మంది విద్యార్థులు కూర్చునివుండేవారు. వివిధ తరగతుల విద్యార్థులకి వరుసపెట్టి వాళ్లకి సంబంధించిన లెక్కలు బోధించేవాడు గురు. ఇక్కడ చెప్పుకోదగ్గ మరో ముఖ్య విషయం ఏమిటి అంటే, గురు ఏ విద్యార్థికి ఎక్కడ బోధిస్తూ ఆపేవాడో, సరిగ్గా అక్కడే తిరిగి అందుకునేవాడు. నిష్ణాతుడైన అవధాని వరుసక్రమంలో పృచ్ఛకులకి వారి వారి ప్రశ్నలకి సమాధానం చెబుతూ, క్రమం తప్పకుండా అవధాన ప్రక్రియ ఎలా చేస్తాడో, అదే విధంగా మా గురు లెక్కల క్లాసు నడిపేవాడు. చేతిలో చిన్న బెత్తం, లేదా ఒక స్కేల్ పట్టుకుని, కుర్చీలో కూర్చుని స్కూల్ లో మాష్టారిలానే క్లాసు నడిపేవాడు. అటెన్డెన్స్ రిజిస్టర్ కూడా వుండేది. క్లాసులకి సరిగ్గా రాకపోతే మందలించేవాడు. కొందరికైతే శిక్షలు కూడా పడేవి. ఎందరో అత్తెసరు మార్కులతో పాస్ అయ్యే విద్యార్థులు మా గురు చలవ వల్ల లెక్కల్లో మంచి మార్కులు తెచ్చుకునే వారు.

కుడిచేతికి రిస్టు వాచీ, గిరజాల జుట్టు, బెల్ బాటం ప్యాంటుతో రాజ్ దూత్ బైక్‌లో వచ్చేవాడు గురు. మా గురు సినిమా హీరో ఎంజీఆర్ అభిమాని. దాదాపు ఐదు దశాబ్దాలుగా ఒకవైపు క్రికెట్ టోర్నమెంట్స్‌ని, మరో వైపు లెక్కల క్లాసులని అవిశ్రాంతంగా నడిపిస్తున్న మా గురుకి ఎన్నడూ ఇవ్వటమే కానీ తీసుకోవటం, అడగటం అన్నవి తెలియవు. ఎందరో పేద విద్యార్థులు ఈరోజు జీవితంలో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నా, గొప్ప క్రికెట్ క్రీడాకారులుగా ఎదిగారన్నా అది మా గురు చలవ. ఎల్.ఐ.సీ.లో ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసినప్పటికీ ఇప్పటికీ అలుపెరుగకుండా అవిశ్రాంతంగా తన గురు టీం కర్మాగారంలో క్రికెట్ క్రీడాకారులని తయారు చేస్తున్న ఫలాపేక్ష ఆశించని ఋషి మా గురు. ద్రోణాచార్యుడికి కూడా కాస్త స్వార్థం వుంది. ద్రుపదుడిని ఓడించాలని పగతో అర్జునుడిని గొప్ప విలుకాడిగా తయారు చేసాడు. కానీ మా గురుకి రవ్వంత స్వార్థం కూడా లేదు. ఇప్పటికీ ఇంకా ఎంతో చెయ్యాలనే తపనతో కనిపిస్తాడు. వ్యాసుడు లోక కళ్యాణార్థం వేదాలని విభజించి, పురాణేతిహాసాలని రాసాడు. వ్యాసుడికి ఎటువంటి స్వార్థపేక్ష లేదు. అందుకే మా గురు మా అందరికే వ్యాసుడంతటి వాడు.

– బీ.యన్.వీ. పార్థసారధి



మేటి గాయకులు ఘంటసాల

"కొందరు గాయకులు తమ గాత్రాన్ని శృతితో మేళవించడానికి ప్రయత్నిస్తారు. కానీ, శ్రీ ఘంటసాల గారి గాత్రంలోనే శృతి పలుకుతూ వుంటుంది. ఇది ఒక అపూర్వ సృష్టి విధానం. గంధర్వాంశ సంభూతులకు గాని, ఇటువంటి గాత్ర సంపద లభించదు" అన్నారు వి. నాగయ్య గారు.

సప్త స్వరాలని అవలీలగా నవరసాలని అలవోకగా అవు పోసన పట్టిన సాటి లేని మేటి గాయకులు శ్రీ ఘంటసాల. శబ్దంలో ఆకారం నాభి నుంచి, ఉకారం ఊపిరి తిత్తులనుంచి, మకారం శిరస్సు నుంచి ఉద్భ విస్తాయని అంటారు. ఉచ్ఛ్వా సంలో "సో" అన్న శబ్దం నిశ్వా సంలో ''హం'' అన్న శబ్దం వస్తుంది. ఈ "సోహం "లో "స, హ'' అక్షరాలూ తీసేస్తే ఆ "సోహం"లో దాగివున్న ఓంకారం గోచరిస్తుంది. శ్వాసని స్వరం (నాదం)తో సమంగా మేళవించ గలిగిన గాయకులు సంగీత సాధకులవుతారు. అటువంటి సంగీత సాధకులలో అగ్రగణ్యులు, నాద యోగి ఘంటసాల.

శుక్రాచార్యుడి దగ్గర మృత సంజీవిని విద్యని నేర్చుకోవటానికి వెళ్ళిన కచుడిని రాక్షసులు సంహరించి అతని భస్మాన్ని సురాపానంలో కలిపి తమ గురువైన శుక్రాచార్యుల చేత త్రాగిస్తారు. తాను మోహించిన కచుడి జాడ తెలియక దేవయాని వ్యధతో తన తండ్రి శుక్రాచార్యుడిని ఆశ్రయిస్తుంది. దివ్య దృష్టితో జరిగినదంతా గ్రహిస్తాడు శుక్రాచార్యుడు. అప్పుడు తన తపోశక్తితో తన దేహంలో భస్మమైవున్న వున్న కచుడిని బ్రతికించి అతనికి మృత సంజీవనిని ఉపదేశిస్తాడు. ఆ పిమ్మట కచుడు శుక్రాచార్యుడి శరీరం నుంచి వెలుపలికి రాగా శుక్రాచార్యుడు విగత జీవి అవుతాడు. తాను ఉపదేశ పూర్వకంగా నేర్చుకున్న మృతసంజీవిని విద్యతో మరల శుక్రాచార్యుడిని కచుడు పునరుజ్జీవితుడిని చేస్తాడు. ఈ సన్నివేశంలో శుక్రాచార్యుడి శరీరం నుంచి వెలుపలికి వస్తున్న కచుడిని వర్ణిస్తూ భారతంలో నన్నయ, "ఉచ్చారణ దక్షు చేత అభిహితం బగు శబ్దం నట్లు బోలె" అంటాడు. అక్షరాలకి జీవం పోసే శక్తి ఉచ్చారణకి వుంది. అటువంటి ఉచ్చారణ శక్తి జన్మతః గలిగిన గంధర్వాంశ సంభూతులు ఘంటసాల గారు.

ఒక వైపు అగ్రనటులకి, మరొకవైపు హాస్య నటులైన రేలంగి వంటి మహా నటులకి వారి వారి గాత్రాలకి అనుగుణంగా తన స్వరాన్ని మలచుకున్నా తనకంటూ ఒక ప్రత్యేక ఒరవడి (స్వరవడిని) ని కలిగిన వ్యక్తి ఘంటసాల. లలిత సంగీతాన్ని, తెలుగు వాడికే సొంతమైన పద్యాన్ని తెలుగు చలన చిత్ర రంగంలో ఒక ఉన్నత స్థాయిని నిలబెట్టిన సంగీత దార్శనికులు ఘంటసాల.

బాల్యములో ఉగ్గుపాలకిబదులు
నీ తల్లి తేనె, పంచదారలు పట్టినదేమో
ఆ నాటినుంచి తేనె మాధుర్యాన్ని
పంచదార తియ్యదనాన్ని సంతరించుకున్నాయి
నీ శ్వాస లో ప్రణవనాదం
నీ నడకలో తాళం
నీ నడతలో శృతి
నీ జీవితమే సంగీతము
సప్తస్వరాల పేటిక నీ గళము
నవరసాల మూట నీ హృదయము
రాగాలకు పుట్టినిల్లు నీ మస్తిష్కము
ఘంటాపథముగా ఘంటసాల పాటల టంకశాల

తెలుగు భాష వున్నంత కాలం ఘంటసాల జీవించి వుంటారు అనటం కన్నా ఘంటసాల గారి పాట ఉన్నంత (విన్నంత) కాలం తెలుగు భాష బ్రతికి వుంటుంది అనటం సముచితం.

– బీ.యన్. వీ. పార్ధసారధి

ఎన్.టీ.ఆర్ జీవితంలో కొన్ని విశేషాలు

"నందమూరి తారకరామారావు గారిది మొదటి నుంచి ఒకటే ఫిలాసఫీ. ఏదయినా వ్యాపారం అంటూ చేస్తే సొంత డబ్బు పెట్టాలి. ప్రభుత్వ రాయితీలు, ఉచిత స్థలాలు ఎందుకనేవారు. అక్కినేని నాగేశ్వరరావుకు స్టూడియో నిర్మాణానికి (ప్రభుత్వం) ఉచితంగా ఇచ్చిన స్థలంలో వేరే వ్యాపారాలు చేయడం ఎన్.టీ.ఆర్.కు నచ్చలేదు. 'వారికి నోటీసులు పంపండి. ఏం పర్వా లేదు' అని ఆదేశాలిచ్చా రాయన....



ఎమ్.జీ.ఆర్ (అప్పట్లో తమిళనాడు ముఖ్య మంత్రి ఎం.జీ రామచంద్రన్) ఢిల్లీ వెళ్ళే సందర్భాలలో ఆయన విమానం హైదరాబాదులో నలభై అయిదు నిమిషాల పాటు ఆగేది. ఎన్.టీ.ఆర్ టిఫిన్ క్యారియర్ పట్టుకుని నేరుగా బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కి తీసుకు వెళ్ళేవారు. అక్కడ తన మద్రాసు మిత్రుడితో కాసేపు ఆప్యాయంగా కబుర్లు చెప్పేవారు. ఇలా చాలా సార్లు జరిగింది...

"తన సినీ జీవితం తొలినాళ్ళలో ఆత్మాభి మానం మెండుగా వున్న ఈ నిండు మనిషి, ఒకసారి నడుచు కుంటూ షూటింగుకు వెళ్లడం చూసి ఆ సినిమా నిర్మాత ఆయనకు ఒక కొత్త కారు కొని ఇంటికి పంపారట. ఆ రోజుల్లో కొత్త కారు ఖరీదు పదిహేను వందల రూపాయలు. తరువాత తనకు డబ్బు సమకూరాక రామారావు గారు ఆ నిర్మాత ఇంటికి వెళ్లి కారు డబ్బులు తిరిగి ఇచ్చేశారట...

"ఎన్.టీ.ఆర్ కు అసలు దేవుడన్నా, పూజలన్నా పెద్దగా నమ్మకం లేదు. ఆయన ఇంట్లో ఎప్పుడూ ఏ వ్రతం కానీ, పూజలు కానీ జరగ్గా నేను చూడలేదు. ఒక్క వేంకటేశ్వరస్వామి ఫోటో మినహా మరే దేవుడి ఫోటో ఆయన ఇంట్లో కనిపించేది కాదు. తిరుమలకు తప్ప రాష్ట్రం లోని మరే ఇతర దేవాలయానికి ఆయన వెళ్లగా చూడలేదు...

"పూజలు పునస్కారాల మీద పెద్దగా నమ్మకం లేకపోయినా, ఎన్.టీ.ఆర్ జ్యోతిష్యాన్ని, వాస్తుని మాత్రం బాగా నమ్మేవారు. ఎవరయినా జ్యోతిష్కుడు వచ్చి పలానా రాయి వున్న వుంగరం పెట్టుకొమ్మని చెబితే దాన్ని తు.చ తప్పకుండా పాటించేవారు. అలా ఆయన చేతి వేళ్లకి ఏడెనిమిది ఉంగరాలు వచ్చి చేరాయి...

"సినిమా షూటింగులకు బయట వూళ్ళకు వెళ్ళినప్పుడు పెద్ద హోటళ్ళలో బస చేసేవారు కాదు. హైదరాబాదు వస్తే , సారధీ స్టూడియోలో ఓ మూల చిన్న గదిలో సర్దుకునేవారు. చిన్నపాటి పరుపు, ఓ దిండు ఇస్తే చాలు, కింద వేసుకుని పడుకునేవారు...

"ఎన్.టీ.ఆర్ కు బాగా దగ్గరగా మసలిన వ్యక్తి బీ.వీ మోహనరెడ్డి. ఒకసారి దైవ దర్శనం కోసం ఎన్.టీ.ఆర్, బీ.వీ.తో కలసి తిరుపతి వెళ్లి వస్తున్నారు. వీళ్ళ కారు వెనకనే వస్తున్న వీ.ఐ.పీ కారు ఒకటి సైరన్ చేసుకుంటూ ముందుకు వెళ్లిపోయిందట. ఆ వీ.ఐ.పీ కారుకు అటూ ఇటూ మరికొన్ని కార్లు. ఈ హంగామాను ఎన్.టీ.ఆర్ ఆసక్తిగా గమనిస్తున్నప్పుడు, బీ.వీ కలగచేసుకుని 'మీ కారు కూడా ఎనభైలో ఇలాగే సైరన్, పైలట్ హంగామా లతో ముందుకు దూసుకుపోతుంది. ఇది తధ్యం అని జోస్యం చెప్పారట...

(మాజీ డీ.జీ.పీ హెచ్.జె దొర రాసిన 'ఎన్.టీ.ఆర్ తో నేను' అనే పుస్తకం నుంచి కొన్ని భాగాలు)

విద్యార్థుల దైవం

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారు సామాన్య నిరుపేద కుటుంబంలో సెప్టెంబర్ 17, 1959 వికారి నామ సంవత్సరం, చిత్తూరుకి ఇరవై అయిదు కిలోమీటర్ల సమీపం, తిరుపతికి యాభై కిలోమీటర్ల దూరంలోని శ్రీరంగరాజపురం (ఎస్.ఆర్.పురం) మండలం, 49వ కొత్తపల్లిమిట్ట ప్రాంతం, దేవళంపేటకు సమీపంలో కమ్మపల్లె అనే కుగ్రామంలో కుచేలునికి ఏమాత్రం తీసిపోని శ్రీనివాసాచార్యులు, పట్టమ్మ దంపతులకు జన్మించారు. నిబద్ధత కలిగిన తండ్రి నడవడిక మాడభూషి జీవితానికి పునాదులు వేసింది. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబ జీవన పరిస్థితుల ప్రభావం ఆయనను ఆలోచింప చేశాయి. ఒకటినుంచి అయిదు తరగతులవరకు పక్కనే ఉన్న గ్రామమయిన బోడిదేవర పల్లెలోను, ఆరునుంచి పదివరకు కొత్తపల్లిమిట్ల ఉన్నత పాఠశాలలోను చదివారు. ఇండర్మీడియట్ చిత్తూరులోని పిసిఆర్ కళాశాల లోను, డిగ్రీ చిత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను పూర్తిచేశారు. ఆ తరువాత 1983లో మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. చేరారు. 1985లో ఎం.ఎ. 1986లో ఆచార్య జివిఎస్ఆర్ కృష్ణమూర్తిగారి దగ్గర 'ఎరుకల తమిళ భాషల్లో బంధువాచక పదాలు–సామాజిక భాషాశాస్త్ర అధ్యయనం' అన్న అంశంపై ఎం.ఫిల్. చేశారు. ఆ తరువాత కేంద్ర సాహిత్య అకాడెమీ గ్రహీత ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మ పర్యవేక్షణలో జి.విఎస్.ఆర్.కృష్ణమూర్తిగారి ప్రోద్బలంతో 1987వ సంవత్సరంలో మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి.లో ప్రవేశించారు. 'ఎరుకలభాషకు వర్ణనాత్మక వ్యాకరణం' అన్న అంశంపై పరిశోధన చేసి 1989లో సమర్పించారు. ఆ సమయంలోనే 'మధుర, రామనాథపురం జిల్లాలో తెలుగుభాష, జానపద సాహిత్యం' అనే అంశంపై యు.జి.సి. ప్రాజెక్టు కూడా చేశారు. అప్పుడే ఆ పరిసర ప్రాంతాల్లోని భాషను కూడా అధ్యయనం చేశారు. ఆ ప్రాంతంలోని అనేక పల్లెలు తిరిగి తెలుగువారి స్థితిగతులను తెలుసుకొన్నారు. అక్కడున్న జానపద కథలు, పాటలు ఎన్నో క్యాసెట్లలో రికార్డు చేశారు. 1990వ సంవత్సరంలో పిహెచ్.డి.మౌఖిక పరీక్ష నిర్వహించడానికి ఆచార్య జి.వి.ఎస్.ఆర్.కృష్ణమూర్తిగారే పరీక్షకులుగా రావడం తన జీవితంలో జరిగిన మరో విశేషం. ఇంకో విశేషం ఏమిటంటే ఇదే మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖలో అత్యున్నతమైన డి.లిట్.పట్టాన్ని కూడా 2015వ సంవత్సరంలో 'అత్యాధునిక తెలుగు కవితా దృక్పథాలు' అన్న అంశంపై పరిశోధన చేసి పట్టభద్రులైనారు. వర్తమాన కాలంలో తెలుగులోనే కాక మద్రాసు విశ్వవిద్యాలయంలో పనిచేసే ఉపాధ్యాయుల్లో డి.లిట్.పట్టాను పొందినవారిలో ప్రథములు కావడం విశేషం.

1989వ సంవత్సరం నుంచి 12 సంవత్సరాల పాటు ఈనాడు, ఉదయం, వార్త, మహానగర్, మాభూమి, విజేత, తెలుగు పత్రిక, తదితర పత్రికల్లో సబ్ ఎడిటర్ స్థాయి నుంచి న్యూస్ ఎడిటర్ స్థాయి వరకు పనిచేశారు. పత్రికల్లో పనిచేసేటప్పుడే పేరు మోసిన పాత్రికేయులు పతంజలి, గజ్జెల మల్లారెడ్డి, కె.రామచంద్రమూర్తి, ఎ.బి.కె.ప్రసాద్ మొదలైన పాత్రికేయులకు సన్నిహితుడై, బూదరాజు రాధాకృష్ణ గారి సఖ్యతతో పత్రికా భాష మీద పట్టు సంపాదించారు. భాషాశాస్త్రంలో గాఢమైన పరిచయం పెంచుకొని భద్రిరాజు కృష్ణమూర్తి వద్ద శబాష్ అనిపించుకొని సన్మానం చేయించుకొన్నారు. పత్రికల్లో పనిచేస్తున్న సమయంలోనే ఎంతోమంది కవులతో, రచయితలతో పరిచయాలు పెంచుకొని, అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యుడై, సామాజిక పరిస్థితులను పసిగట్టి పత్రికల్లో 'కవాతు' పేరుతో వ్యంగ్య శీర్షికను కూడా చాలా కాలం నడిపారు. పత్రికల్లో పనిచేసేటప్పుడే ఎన్నో కవితలను రచించి ప్రచురించారు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడే వివిధ పత్రికల్లో వందలాది వ్యాసాలు రాశారు. గాఢమయిన విమర్శతో హాస్య, వ్యంగ్య రచనలతో, సరళమయిన భాషతో, చక్కనయిన భావవ్యక్తీకరణతో పాఠకుల్ని తనతోపాటు తీసుకొని వెళ్ళగలిగే సామర్థ్యం ఉన్న, చెయ్యితిరిగిన రచయిత అనిపించుకున్నారు. ఆ తరువాత



2000 నవంబర్ 16న మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో లెక్చరర్‌గా చేరారు. ఆ నాటి నుంచి ఈ నాటి వరకూ తెలుగుశాఖకు కృషిచేస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలుగుశాఖలో అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈయన ఆధ్వర్యంలో– 1.ప్రసారమాధ్యమాలు: భాష, సాహిత్య, సమాజం, 2.ఇంగ్లీష్–ద్రావిడ భాషలు:అనువాదాలు, 3.రామాయణం, 4.మీడియా: నాడు, నేడు, 5.శ్రీభగవద్రామానుజ వైభవం, 6.శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రి, భాష, సాహిత్య సేవ, 7.ఆల్ ఇండియా కాన్ఫరేన్స్ ఆఫ్ ద్రవిడియన్ లింగ్విస్టిక్స్, 8.తెలుగు సాహిత్యం శ్రీకృష్ణతత్త్వం 9.భగవద్గీత – వర్తమాన సమాజం, 10.మహాకవి గురజాడ అప్పారావు 11.పాలగుమ్మి పద్మరాజు 12.తెలుగు, తమిళ వర్తమాన సాహిత్యం–తులనాత్మక అధ్యయనం 13.తిరుమల రామచంద్ర సాహిత్య మూర్తిమత్వం 14.'తాళపత్ర గ్రంథ పరిష్కరణ' 15.'వీరేశలింగం సాహిత్యం – సామాజిక దృక్పథం' 16.తెలుగు శాఖ పరిశోధనలు వంటి జాతీయ సదస్సులే కాకుండా, 1.మహాకవి: శ్రీశ్రీ జీవితం, సాహిత్యం, దృక్పథం, 2.శ్రీకృష్ణదేవరాయల సాహితీ శేముషి 3.సమకాలీన కవితా ధోరణులు 4.అన్నమయ్య పదాలు వివిధ దృక్పథాలు, 5.మహాకవి జాషువా సాహిత్యం సమాలోచనం, 6.సి.పి.బ్రౌన్: జీవితం, వ్యక్తిత్వం, వ్యాసంగం, 7.తెలుగు, తమిళ సాహిత్య సంబంధాలు, 8.పరిశోధన: నాడు, నేడు, రేపు, 9.భారతీయ భక్తి సాహిత్యం అన్న అంతర్జాతీయ సదస్సులను కూడా నిర్వహించారు. ఇవికాకుండా ప్రతి సంవత్సరం కవి సమ్మేళనాలు, ఉగాది ఉత్సవాలు, అవధానాలు,పుస్తకావిష్కరణలు, ధర్మనిధి ఉపన్యాసాలు మొదలయిన సాహిత్య కార్యక్రమాలు ఎడతెరపి లేకుండా నిర్వహించారు అన్నిటికన్నా మించి 24 గంటలసేపు రాత్రింబవళ్ళు నిరవధికంగా కవిసమ్మేళనం నిర్వహించి ప్రపంచరికార్డు సృష్టించారు. మాడభూషి సంపత్‌కుమార్ గారు వివిధ విశ్వవిద్యాలయాలు, వివిధ కళాశాలల్లో, రాష్ట్రేతర ప్రాంతాలలో 200 పైగా జాతీయ సదస్సుల్లోనూ, ఇరవై ఏడు అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పించారు.

1. మద్రాసు విశ్వవిద్యాలయం మెరీనా క్యాంపస్ డైరెక్టర్‌గా మూడుసార్లు పదవీ బాధ్యతలను నిర్వహించారు. తెలుగుశాఖలో క్యాంపస్ డైరెక్టర్ అయిన వారు వీరే.
2. మద్రాసు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్స్ ఫోరమ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు.
3. మద్రాసు విశ్వవిద్యాలయం తరపున సర్ త్యాగరాయ కళాశాలకు ప్రాతినిధ్య పదవిని చేపట్టారు. ఇలా ఎన్నో కళాశాలలకు ప్రాతినిధ్య బాధ్యతను చేపట్టిన మాడభూషి ప్రస్తుతం డిఆర్‌బిసిసి హిందూ కళాశాలకు విశ్వవిద్యాలయ నామినేటడ్ మెంబర్‌గా ఉన్నారు.
4. శ్రీపొట్టి శ్రీరాములు మెమోరియల్ సొసైటీకి కార్యదర్శిగా పదవి పొందారు.
5. తెలుగు భాషా పరిరక్షణ వేదిక, చెన్నైకు కార్యదర్శిగా ఉన్నారు.
6. యుజిసి, యుపిఎస్‌సి, సిబిఎస్ఇ లలో వివిధ రూపాల్లో సేవలందిస్తున్నారు
7. తెలంగాణా సెట్, తమిళనాడు సెట్ పరీక్షలకు సేవలందిస్తున్నారు.
8. పదిహేను విశ్వవిద్యాలయాల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్, బోర్డ్ ఆఫ్ క్వశ్చన్ పేపర్ సెట్టర్స్ పదవుల్లో ఉన్నారు
9. మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం అకడమిక్ కౌన్సిల్ మెంబర్‌గా పనిచేశారు
10. మద్రాసు విశ్వవిద్యాలయం అకడమిక్, సెనేట్ మెంబర్‌గా ఉన్నారు.
11. తమిళనాడు 1–10 తరగతులకు, +1, +2 తరగతులకు పాఠ్యపుస్తక తయారీలో కీలక పాత్ర పోషించారు.
12. కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారాల ఎంపికలో సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి అనేక పదవుల్లో ఆయన రాణించారు,
13. ఇప్పటివరకూ సుమారు 250 మంది పిహెచ్‌డి సిద్ధాంతవ్యాసాలకు పరీక్షకులకు ఉన్నారు. ఇలాంటివి ఎన్నో.
14. తెలుగుశాఖలో ఎం.ఎ.లోగానీ, ఎం.ఫిల్.లోగానీ ఎక్కువమంది విద్యార్థులను చేర్పించింది కూడా ఈయనే.
15. తెలుగుశాఖకు వివిధ సందర్భాల్లో పి.సుశీల, ఎస్.జానకి, బాల మురళీకృష్ణ, భువనచంద్ర, వెన్నెలకంటి, మండలి బుద్ధప్రసాద్, కొణిజేటి రోశయ్య, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ స్వరూపానందగిరి స్వామి, శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరా నందభారతీస్వామి మొదలయిన ప్రముఖులెందరినో ఆహ్వానించారు.

అదేసమయంలో తెలుగుశాఖలో తక్కువ కాలం పనిచేసినవారు కూడా వీరే కావడం విశేషం.

మాడభూషి సంపత్‌కుమారి గారి కలం నుండి ఆణిముత్యాల్లాంటి రచనలు వెలువడ్డాయి. ఆయన రచనల్లో స్పృశించని సాహిత్యాంశం లేదంటే ఆశ్చర్యమే. వ్యాకరణం, భాషాశాస్త్రం, జానపదం, అనువాదం, జర్నలిజం మొదలయిన అంశాలపై రచనలు చేశారు.

మాడభూషి రచనలు :

1.కవితా! ఓ కవితా! – వస్తువు, భాషా శైలి, 2010 2.మద్రాసులో తెలుగు పరిశోధన, ప్రచురణ, 2012 3.వ్యాస సంపద, 2013 4.వ్యాకరణ విజ్ఞానం, 2013 5.తమిళ జానపద కళలు, 2014 6.అనువాద విజ్ఞానం, 2014.

సంపాదకీయాలు : 1.గడ్డిపరకతో విప్లవం, 2001,2.ఆంధ్ర మహాభారతం–వివిధ శాస్త్రపరిజ్ఞానం,(సం.) 2009 3.ఒక విజేత (అబ్దుల్ కలాముకు తెలుగువారి నివాళి (సం.), 2015 4.పరిశోధన : నాడు, నేడు, రేపు, 2016 5.తెలుగు దీప్తి 2019.

అనువాదం : 1.సామాజిక శాస్త్రవేత్త పెరియార్, 2002, 2.అమ్మవాసన, 2008 3.జన్మభూమి, 2008 4.ప్రజారోగ్యానికి పనికొచ్చే సూత్రాలు, సులభమైన మార్గాలు, (అనువాదం), 2015

మాడభూషి కవిత్వం : 1.జీవితం–కవిత్వం, 2013 2.శత్రువుతో ప్రయాణం, 2015 3.ఆలోచనలు, 2015 4.చివరకు నువ్వే గెలుస్తావు, 2016 5.మూడో మనిషి, 2017 6.వికారి 2019

సమాజంలో ఏ చిన్న విషయాన్ని చూసినా వెంటనే స్పందించి కాగితం మీద కలం పెట్టి అక్షర రూపం అమర్చేవారు. దేశ, ఆర్థిక, రాజకీయ, సామాజిక, అంశాలపై ఆలోచన మెండు. అందువల్లనే తనకు సమయం ఉన్నప్పుడెల్లా తన భావాలను కవితల రూపంలో వెలువరించేవారు. పేదల కష్టాలు, సామాన్యుల సమస్యలు, స్త్రీవాదుల దు:ఖాలు, నాయకుల ఆగడాలు సమాజంలో జరిగే దోపిడీలు, దేశభక్తి ఇలా చెప్పుకుంటూపోతే పలు విషయాలను కలంతో చెక్కేవారు. అలతి అలతి పదాలతో అనంత అర్థాలు వచ్చే విధంగా రాసేవారు.

మాడభూషి అందుకున్న అవార్డులు – బిరుదులు

మాడభూషి వారి భాషా కృషికి, సాహిత్యానికి చేసిన సేవలకు మెచ్చి–

1. 2007–2008 సంవత్సరంలో హైదరాబాదు లయన్స్ క్లబ్ వారు "ఆంధ్ర భాషా విభూషణ" బిరుదునిచ్చి సన్మానించారు.
2. 2012 అక్టోబర్‌లో తెలుగు లిపిపై బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పణ చేసి తెలుగు లిపికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొని వచ్చారు
3. 2014 జనవరి 22వ తేదీన తమిళనాడు హిందీ అకాడెమీ, విశ్వ హిందీ దీవాస్, వారు 'శిక్షక్ సిందు సమ్మన్' అవార్డును ప్రదానం చేశారు.
4. 2014 జనవరి, 22వ తేదీన మల్లవరపు జాన్ మధుర సాహితీ భారతి, తెలుగు సాహిత్య సేవ సంస్థ సంస్కృతి, ఒంగోలు వారు విశిష్ట సన్మానం అందజేశారు.
5. 2014 ఫిబ్రవరి 29వ తేదీన భాషా పరిరక్షణ సమితి, పుంగునూరు వారు 'తెలుగు వ్మాయ ప్రగతి రత్న' అవార్డును బహుమతి చేశారు.
6. 2016 ఫిబ్రవరి 13వ తారీఖున చిత్తూరు జిల్లా యూనివర్సల్ పీస్‌క్రాస్‌వారు చిత్తూరులో సరోజిని నాయుడు 137వ జయంతి సందర్భంగా 'కవికోకిల అవార్డు'ను ప్రదానం చేశారు.
7. 2016 జులై 29వ తేదీన చిత్తూరు జిల్లా యూనివర్సల్ పీస్‌క్రాస్‌వారు చిత్తూరులో 'సాహిత్యరత్నఅవార్డు' అన్న పేరుతో జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు.
8. 2016, అక్టోబర్ 1వ తేదీన కళాభారతి పౌండేషన్ మరియు రేవతి పౌండేషన్, వి.కోట సంయుక్త నిర్వహణలో 'జాతీయ తెలుగు కవి సమ్మేళనం'లో భాగంగా 'జీవిత సాఫల్య పురస్కారా'న్ని ప్రదానం చేశారు.
9. 2017 ఆగస్టు 29వ తేదీన చిత్తూరు జిల్లా లలితకళాసాగర్ ఆధ్వర్యంలో 'శ్రీకృష్ణదేవరాయల జాతీయ పురస్కారం–2016' ప్రదానం చేశారు.
10. కళామిత్ర మండలి 11వ వార్షికోత్సవ వేడుకల్లో జాతీయ స్థాయి పురస్కారం–2017కు గాను శ్రీనర్రా నరసయ్య కోటమ్మల స్మారక సాహితీ ప్రతిభా పురస్కారాన్ని నవంబర్ 5, 2017లో ప్రదానం చేశారు.
11. 2019వ సంవత్సరంలో 'తెలుగు వెలుగు' అవార్డును పెరంబూరు తెలుగు సాహితీ సమితి ప్రదానం చేశారు.
12. 2015 ఆగస్టు 25వ తేదీన భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, చిత్తూరు వారు కరుణశ్రీ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు.
13. 2019 సెప్టెంబరు 25వ తేదీన మద్రాసు క్రైస్తవ కళాశాల, తెలుగుశాఖ, ఆంధ్ర భాషా రంజని సంఘంవారు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు.

విదేశీ పర్యటనం : సింగపూర్, మలేషియా, శ్రీలంక, థాయిలాండ్ తదితర దేశాలలో అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పత్రసమర్పణ చేశారు.

పరిశోధన

పరిశోధనలకు పుట్టినిల్లు మద్రాసు విశ్వవిద్యాలయం. అలాంటి మద్రాసు విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా ఉన్నటువంటి మాడభూషి సంపత్‌కుమార్ గారు ఆధునిక పరిశోధకుల్లో తనకంటూ ప్రత్యేకతను స్థానాన్ని సంపాదించుకొన్నారు. తెలుగు విద్యార్థులకు పర్యవేక్షణ బాధ్యతను నిర్వహించడమే కాకుండా ఎంతో మంది ఇతర శాఖల్లో పరిశోధనలు చేస్తున్న పరిశోధక విద్యార్థినీ విద్యార్థులకు సహాయసహకారాలను అందించిన ఘనత మాడభూషి వారిదే. మాడభూషి సంపత్‌కుమార్ గారి పర్యవేక్షణలో ఎం.ఫిల్ అవార్డు అయిన వాళ్ళు డెబ్భై ఆరు మంది, ప్రస్తుతం చేస్తున్న వాళ్ళు ముగ్గురు. ఇరవై ఏడు మంది పిహెచ్.డి. పట్టాలను పొందారు. ప్రస్తుతం చేస్తున్న వాళ్ళు ఎనిమిది.ఇంతేకాకుండా వీరి పర్యవేక్షణలో ద్రావిడ విశ్వవిద్యాలయంలో కూడా డాక్టరేట్లు పొంది ఉన్నారు. తెలుగుశాఖలో ఎక్కువ పిహెచ్.డి.లకు, ఎక్కువ ఎం.ఫిల్.లకు పర్యవేక్షణ వహించిన ఘనత ఈయనకే దక్కుతుంది.

విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన మూరరాయదగండడు శ్రీకృష్ణదేవ రాయల పాలనా కాలం 19 సంవత్సరాల కొన్ని నెలలు మాత్రమే. మాడభూషి సంపత్‌కుమార్ గారిది కూడా ఇంచుమించు అదే సంఖ్యలో వస్తుంది. ఆయన ఏ విధంగా కవులను పోషించి సత్కరించారో వీరు కూడా ఎంతోమంది కవులను ప్రేరేపించి కవిత్వం రాయించారు. వారికి సన్మానాలు చేశారు. కొంతమందిని కవితా సంపుటాలు వేయడానికి కూడా ప్రేరేపించారు. ఇలా చెప్పుకొంటూపోతే మాడభూషి గారి జీవితమే ఒక సంపుటి అవుతుంది. అన్ని చెప్పుకోవడానికి వీలు కుదరడం లేదు. అయినా చెప్పకుండా దాటలేకపోతున్నాం. విశ్వవిద్యాలయంతో అనుసంధానంగా మద్రాసులో ఉన్న తెలుగు సంస్థలను కలుపుకొని ఎన్నో కార్యక్రమా లను నిర్వహించారు. అటు ఆంధ్ర, తెలంగాణాలలో ఉన్న విశ్వవిద్యాలయాలకు అడుగుపెట్టి అక్కడున్న అన్ని విశ్వవిద్యాలయాల ఆచార్యులను కూడా తెలుగు శాఖకు ఆహ్వానం పలికిన ఘనత కూడా మాడభూషి గారిదే. ఆంధ్ర, తెలంగాణాలలో ఉన్న విశ్వవిద్యాలయాల అనుసంధాన కళాశాలల ఉపన్యాసకులను కూడా గుర్తించి వారిని విశ్వవిద్యాలయానికి ఆహ్వానించారు. రెండు దశాబ్దాల కాలంలో ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల్లో తెలుగు చదువుకుంటున్న ప్రతి ఒక్కరికి మాడభూషి సుపరిచితులే. మద్రాసు విశ్వవిద్యాలయాన్ని పుస్తక ఆవిష్కరణలకు, పుస్తక సమీక్షలకు, కవుల సత్కారానికి, ఉగాది సంబరాలకు, చర్చా గోష్ఠులకు, మంచి మంచి ఉపన్యాసాలకు మద్రాసు విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖను వేదికగా చేశారు. తెలుగు శాఖల్లో అంతర్జాతీయ సదస్సులకు నాంది పలి కింది ఈయనే. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో జీవన సాఫల్య పురస్కారాలను అందచేసిన ఘనత మాడభూషి గారికే చెందుతుంది. తెలుగు లిపి గురించి ప్రపంచ దేశాలకు తెలియజేసిన ఘనత కూడా మాడభూషిదే. మారిషస్‌లో ఉన్న తెలుగు కళాశాలలను, వివిధ సంస్థలను దర్శించిన మాడభూషి తెలుగు ఖ్యాతి కోసం ఎంతో పాటుపడ్డారు. ఇలా చెప్పుకొంటూపోతే ఒకటా రెండా తెలుగు ఉన్న ప్రతి గల్లినుంచి ఢిల్లీ తెలుగుశాఖ వరకు వారి పేరు మారుమ్రోగుతుందంటే ఆయన నిర్విరామంగా అంకిత భావంతో తెలుగు కోసం నిరంతరం తపిస్తున్న తపస్వి.

– డాక్టర్ కె.లక్ష్మణ & డాక్టర్ ఎం.మునిరత్నం



పూర్ణాయురారోగ్య పుణ్యమూర్తి సకల నరసింహులు శ్రేష్ఠి

ధర్మజ్ఞుడెవడు? కృతజ్ఞుడెవడు? వీర్యుడెవడు? విబుధుడెవడు? సత్య చరిత్రుడెవడు? సర్వశూరుడెవరు? సాధుస్వభావుడెవడు? ఆత్మవంతుడెవడు? అనసూయుండెవడు? బుద్ధిమంతుడెవడె? గాంభీర్యవంతుడెవడు? క్షమాపూర్ణుడెవరు? నియతాత్మకుడెవడు? నీతిమంతుడెవడు? విజేత యెవడు? వాల్మీకి నారదుణ్ణి ప్రశ్నించినట్టు నన్ను నేనూ ప్రశ్నించు కుంటున్నాను. శ్రీరాముడు అనే సమాధానం వచ్చింది. అట్టి రామజననం కారణంగా శ్రీరామ నవమి పుణ్యం సంపాదించుకున్నది. అట్టి శ్రీరామనవమి నాడే నరసింహులు చెట్టి పుట్టారు. సకల జనశ్రేయోభిలాషియైన సకల నరసింహులు చెట్టి 90వ పడికి చేరుకున్న నరసింహులు శ్రేష్ఠికి వృద్ధత్వమే భయపడి పారిపోయింది. తొమ్మిది పదులకు విశేషం ఉన్నది.

ఎనిమిది పదులు నిండిన తరువాత ధర్మరాజు కురుసామ్రాజ్య పట్టాభిషిక్తు డయ్యాడు. 170 ఏండ్లు జీవించి భీష్ముడు స్వచ్ఛంద మరణం పొందాడు. శ్రీకృష్ణభగవానుడు 125 ఏండ్లు జీవించి, తాను కల్పించుకున్న వేటగాని చేతిలో ఇహలోకం విడిచాడు. ఆ వేటగాడే గతజన్మలోని వాలి అంటారు. గాకున్నచో కాలిబొటన వేలుకు బాణం తగిలి మరణించడం జరుగుతుందా?

మానవులు అలసులు మందాబుద్ధిమంతులు అల్పతరాయువులు– అన్నారు. తానుండగానే ధర్మవర్తనునిగా నున్నవారిని 'జీవేయ శరద శతమ్! నందామము శరదశ్శతమ్' అన్నది వేదసూక్తి. వేదం చెప్పిన సత్యాన్ని అధిగమించే శక్తి ప్రకృతికి లేదు. శాంతశక్తి కలవారికి ఆయువు శ్రీరామరక్ష!

రామరక్షయే సర్వజగద్రక్ష. సర్వజగద్రక్ష శుభఫలి. శ్రీరామనవమి జనితుడు సకల నరసింహులు శ్రేష్ఠునికిది వర్తిస్తుంది. అస్తు శుభమస్తు! సుఖమస్తు! శుభమస్తు! చిరాయురారోగ్య ప్రాప్తిరస్తు! కళ్యాణమస్తు!

– శ్రీగోపేటి శ్రీరామారావు

ఇంతవరకూ నాన్నగారు రాసి వుంచారు.
దీనిని నా శైలిలో పూర్తిచేస్తున్నాను.

సకలము తెలిసిన ప్రతిభావంతులు నరసింహచెట్టి గారు

ఒక 18 ఏళ్ళ యువకుడు, ఆయన మావగారు అప్పటికే బంగారు వ్యాపారంలో గౌరవనీయులు, బెంగుళూరు నగల వ్యాపారుల అసోసియేషన్ వ్యవస్థాపకులు అయిన శ్రీదేవతా శ్రీరామయ్యచెట్టిగారి వద్ద బంగారు వ్యాపారంలోని మెళకువలు నేర్చుకుని, 8 సంవత్సరాల అనుభవంతో 1952లో ప్రతిభా జ్యుయలరీ సంస్థను స్థాపించారు. ఆయనే సకల నరసింహ చెట్టిగారు.

సకల నరసింహులు చెట్టిగారికి మన కావ్యాలు, పురాణాలు, ప్రబంధాలు అంటే అత్యంత ప్రీతి అందుకే ఆయన చాలా ధార్మిక సంస్థలలో ట్రస్టీగా వుంటూ మన సాంప్రదాయానికి, సంస్కృతికి, భగవత్ కైంకర్యానికి ఎన్నో గుప్తదానాలు చేశారు. చేస్తూనే ఉన్నారు. ఆయనకు కాళిదాసు 'కుమారసంభవం'లోని ప్రతిభ అనే పదం ఆయన హృదయానికి హత్తుకుంది. ప్రతిభ అంటే అనుకున్నదానిని ఊహించి సమర్థతతో తయారు చేయడం. అలాగే ఆయన మదిలో ఆలోచనకు, తన బంగారు నగలలో ఆకృతిని యిచ్చి అవి జనులకు నచ్చేవిధంగా వారు మెచ్చేవిధంగా తయారు చేసేవారు. అందుకే ఆయన వ్యాపార సంస్థకు, పెద్ద కుమార్తెకు ప్రతిభ అని పేరు పెట్టుకున్నారు. 20 అడుగులకు × 6.5 అడుగుల విస్తీర్ణంలో ప్రారంభించిన ఆ నగల దుకాణం ప్రస్తుతం బెంగుళూరు వాసుల హృదయాలను ఆకట్టుకుని రిచ్‌మండ్ స్క్వేర్‌లో నాలుగు అంతస్థుల వ్యాపార సంస్థగా ఎదిగింది. ఆయనతోపాటుగా ఆయన కుమారులు శరత్‌కుమార్, మురళీమోహన్‌లు ఇద్దరూ ఇంజనీరింగ్ పట్టభద్రులు. తండ్రిగారితో చేరి ప్రతిభా జ్యుయలరిని అత్యంత ప్రతిభావంతంగా నిర్వహిస్తూ బెంగుళూరు వాసుల అభిమానాన్ని, ఆదరాన్ని చూరగొన్నారు. ప్రతిభా జ్యుయలరీ 1977లో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని రజతోత్సవ సంవత్సరంలో సకలాజి మార్కెట్‌లో తనకంటూ ఒక స్వంత భవనాన్ని ఏర్పరచుకుంది.

2001లో మురళీమోహన్‌గారి కుమారుడు సంజీవమోహన్ అమెరికాలో జెమ్మాలజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అమెరికాలో, నార్టన్ బిజినెస్ స్కూలులో పట్టభద్రుడయ్యి, తాతగారు, నాన్నగారు, బాబాయిలతో కలిసి ప్రతిభా జ్యుయలరీలో తన యొక్క మేధస్సును కూడా ఉపయోగించి వ్యాపార రంగంలో ప్రతిభా జ్యుయలరీని ప్రముఖస్థానంలో నిలిచేలా కృషి చేస్తున్నారు.

2003లో ప్రతిభా జ్యుయలరీ తన స్వర్ణోత్సవ సందర్భంగా (గోల్డెన్ జూబ్లీ) ప్రస్తుతమున్న నాలుగు అంతస్థుల భవనాన్ని రిచ్‌మండ్ స్క్వేర్‌లో నిర్మించుకుంది. ప్రతిభా జ్యుయలరీ 1952 నుండి ఇప్పటివరకు సకల నరసింహులు చెట్టిగారి అనుభవం, విజ్ఞానం, ప్రతిభతో కుమారులు, మనవడు కూడా చేదోడువాదోడుగా వుంటూ అంచెలు అంచెలుగా ఎదిగి బెంగళూరులో పేరెన్నికగన్న సంస్థగా దినదినాభివృద్ధి చెందింది.

వారి షోరూంలో చిన్న ముక్కుపుడక నుండి పురాతన స్టైల్ (Antique) కంఠాహారం వరకు వివిధ డిజైన్‌లలో, ఆకృతులలో నగలు లభిస్తాయి.

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది


అంబికా దర్బార్‌బత్తి

ప్రతిభా(వంతులు) నరసింహచెట్టి గారితో వారి కుమారులు శరత్‌కుమార్, మురళీమోహన్, మనవడు సంజీవ్ మోహన్

శ్రీనరసింహులు చెట్టిగారు 90 ఏళ్ళ వయస్సులో 75 ఏళ్ళ వ్యాపార అనుభవంతో ఈనాటికి రోజూ ఆయన షోరూంకు వస్తూ ఉండడం, చురుకుగా వ్యాపారాన్ని పర్యవేక్షిస్తుండటం చూస్తే ఆయన అంకితభావం మనకు తెలుస్తుంది.

ఆ నాలుగు అంతస్థుల నగలదుకాణంలో వాడుకదారులు ఏ వస్తువులు కొన్నా సరే లెక్కలన్నీ అయ్యాక తిన్నగా పెద్దాయన దగ్గరకు కాని వారి కుమారులు దగ్గరకు కాని వచ్చి ఆ నగను వారికి చూపించి వారి నుండి తీసుకోవడం నేను నా కళ్ళారా చూసాను. అలా వారితో అనుబంధం పెంచుకున్న వాడుకదారులు ఎక్కువ. కొనుగోలుదారులతో కలుపుగోలుతనంతో మాట్లాడుతూ, వారిని ఆత్మీయులు, కుటుంబ సభ్యులను పలకరించినట్లుగా పలకరిస్తూ వారిని అన్ని విధాల సంతృప్తిపరుస్తూ, వారికి కావలసిన రీతిలో, వారు అనుకున్న బడ్జెట్‌లో చక్కగా వారికి కావలసిన వస్తువులు అందించి వారిని సంతృప్తిపరచటంలో శ్రీనరసింహులుగారు, వారి కుమారులు అత్యంత శ్రద్ధ చూపుతారు. అక్కడ సేల్స్‌మ్యాన్ వారు వున్నా చివరగా వీరి దగ్గరకు వచ్చి, వారిని పలకరించకుండా ఏ కస్టమరు వెళ్ళరు. వెండి, బంగారు, ప్లాటినమ్‌తోపాటు వజ్రం, కెంపు, మరకతం, పగడం వంటి రాళ్ళను దోషం లేకుండా తగు సర్టిఫికెట్‌తో వీరి వద్ద లభిస్తాయి. అంటే వ్యాపారంలో వారెంత స్టాండర్డ్‌ను పాటిస్తున్నారో మనకు తెలుస్తుంది. 65 ఏళ్లుగా ఈ రంగంలో పేరుప్రఖ్యాతులతో వున్నారు. దాని వెనుక వారి శ్రమ, కృషి, దక్షత అన్నిటికి మించి నిబద్ధత కారణం. వారి కస్టమర్లు బెంగుళూరులోనే కాదు భారతదేశం, విదేశాల నుండి కూడా వచ్చి వారి వద్ద కొనటం విశేషం. బహుమతిగా ఇచ్చే చిన్న వస్తువు నుండి అతి పెద్ద విలువయిన కంఠాభరణం వరకు వారి దగ్గర లభిస్తాయి. కాలి మెట్టె నుండి నెక్లెసు, గాజులు, ప్లాటినమ్ రింగులు, వెండి భోజన సెట్ మొదలుగా నలభైవేల రకాల వస్తువులు వున్నాయి. బెంగుళూరు నగరంలో మకుటాయమానంగా వెలుగొందుతున్న ప్రతిభా జ్యుయలరీ ఇంకా ఎత్తుకు ఎదగాలని, దినదినాభివృద్ధి చెందాలని ప్రముఖాంధ్ర ఆశ, ఆకాంక్ష!

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

పదకవితామహుడైన అన్నమయ్యను మావాడంటారు సాహితీమూర్తులు. వాగ్గేయకారుడు కనుక మావాడంటుంది కర్ణాటక సంగీతలోకం. లలితమైన పదాలతో శృంగారాన్ని ఒలికించాడు కనుక మావాడంటారు సినీ, లలితసంగీత కళాకారులు. జనపదాలు పాడిన అన్నమయ్య మావాడంటారు జానపదులు. తత్వబోధ చేశాడు కనుక మావాడంటారు వేదాంతులు. రామానుజ సిద్ధాంత మతప్రచారకుడు కనుక మావాడంటారు శ్రీవైష్ణవులు. సర్వమానవ సమానత్వాన్ని చాటాడు కనుక మావాడంటారు సంఘసంస్కర్తలు. మధురభక్తిలో తనిసి, తరించినవాడు కనుక మావాడంటారు భక్తజనం...

అయితే, నాఉద్దేశ్యంలో అన్నమయ్య అందరివాడు. ఆయన రచనలలోని వైవిధ్యం, మరి యే కవిలోనూ కానరాదు. వేలకొలదీ సంకీర్తనలలో ప్రతి ఒక్కటీ ఒక ఆణిముత్యమే...ఆలోచనామృతమే.

నా అనుభవంలో అన్నమయ్య సంకీర్తనల పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించటం, 'కత్తిమీద సాము' వంటిది.' అలరులు కురియగ' కృతిని రాగ, స్వరసహితంగా శుద్ధ శాస్త్రీయపద్ధతిలో ఒకరు పాడతారు. 'ఏమొకో చిగురుటధరమున' అంటూ భావబంధురంగా లలితంగా మరొకరు ఆలపిస్తారు. 'తందనానా ఆహి' అంటూ జానపద ఫక్కీలో మరొకరు గానంచేస్తారు... వీరిలో అందరికీ సమానంగా హర్షధ్వానాలిస్తారు శ్రోతలు... అయితే గాయకులు ఎంచుకొన్న ఆ కీర్తనలు వారు పాడిన బాణీలో కాక, మరొకరకంగా పాడితే ఎంత ఎబ్బెట్టుగా ఉంటుందో ఊహించండి..దేనికదే ఒక ప్రత్యేకతను కలిగి ఉంటాయి. వీటిలో దేనికి ప్రథమ బహుమతి ఇవ్వాలి? అనేది సదా ప్రశ్నార్థకమే..

అది అన్నమయ్య పదంలో ఉన్న విలక్షణత!

అన్నమయ్య సాహిత్యమయితే రాగిరేకులలో నిక్షిప్తం చేయబడటంచేత లభ్యమైంది కానీ స్వరమెట్లు లేకపోవటం చేత, ఎవరికి నచ్చిన బాణీలో వారు స్వరపరచుకొని, పాడుకుంటున్నారు. అలాగని అన్నమయ్య కీర్తనలు స్వరపరచటానికి అందరికీ అర్హత ఉంది అనవచ్చా? కనీస రాగ, తాళ, భాషా పరిజ్ఞానం లేకుండా వాటిని స్వరపరచవచ్చా? లేదు...అయితే... ఆ సాహిత్యాన్ని బాగా మనసుకు పట్టించుకొని, అందులోని అచ్చ తెనుగుపదాల అర్థాలను ఆకళింపు చేసుకొని, సంగీత ఛందస్సును పాటిస్తూ, ఆనాటి కాల, మాన పరిస్థితులపై కూడా కొంత అవగాహనతో చేసిన బాణీలు నిలబడుతున్నాయి. లేనివి కాలగర్భంలో కలసిపోతున్నాయి.

ఉదాహరణకు 'అంతర్యామి! అలసితి, సొలసితి' అంటూ ఎంతో నిర్వేదంతో అన్నమయ్య పాడుకొన్న సంకీర్తనను, హుషారెక్కించే 'కుంతలవరాళి' రాగంలో కదంతొక్కించినా,' చక్కని తల్లికి చాంగుభళా' అనే జానపదాన్ని 'నీలాంబరి' వంటి నిద్రపుచ్చేరాగంలో స్వరపరచినా శ్రోతలు మెచ్చగలరా?

అన్నమయ్య సంకీర్తనలను, సంగీత విద్వాంసులే స్వరపరచాలని, వాటిని కచ్చేరీలలో ప్రధానాంశంగా పాడుకొనేట్లు చేయాలనే తలంపు సైతం సరికాదు. అన్నీ అందుకు వీలు పడవు.

అనేక ఘనమైన రాగాలను మాలికగాచేసి, క్లిష్టమైన తాళంలో కూర్చిన బాణీ కన్నా, సులువుగా అందరూ పాడుకొనే వీలుతో, అరటిపండు ఒలిచిపెట్టిన రీతిగా సాహిత్యం తెలిసేట్లు సరళంగా చేసిన ఒక అన్నమయ్య జోలపాట జనబాహుళ్యంలో ఎక్కువ ప్రచారంలో ఉంది.

రాగమాలికగా బహుళ ప్రసిద్ధమైన అన్నమయ్యకీర్తన 'ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన'... బృందావనసారంగ, మాయామాళవగౌళ రాగాలలో స్వరపరచబడింది. నిజానికి అది రాగమాలిక కాదు. రెండు కన్నా ఎక్కువ రాగాలలో కూర్చితేనే అది మాలిక అవుతుంది. ఆకీర్తన నడక, చతురస్ర గతిలో నల్లేరుమీద నడకలా సాగుతుండగా, దానికి విరుద్ధమైన మిశ్రచాపు తాళంలో కూర్చవలసిన ఔచిత్యం ఏమిటి? పైగా.. ఖచ్చితమైన ఛందోనియమాలు పాటించబడిన అన్నమయ్య కీర్తనకు,ఆవిధంగా తాళభేదం చేయటంతో ఛందోభంగం కలగలేదా!

మహావిద్వాంసులైన మంగళంపల్లివారిని ఒక సందర్భంలో అన్నమయ్య గురించి మాట్లాడమంటే, 'అన్నంకోసం పాడుకొనేవాణ్ణి, అన్నమయ్య గురించి ఏమి మాట్లాడగలను?' అన్నారు. అటువంటిది... ఈనాడు అన్నమయ్య కీర్తనలను ధనసముపార్జనకు ఒక సాధనంగా భావించి, అరకొర సంగీత, సాహిత్య జ్ఞానంతో, అన్నమయ్య హృదయాన్ని కొంతైనా తెలుసుకోకుండా కొందరు స్వరపరచి పాడటం, పాడించటం ఆ మహావాగ్గేయకార శిరోమణికి అందించే నిజమైన నివాళి అనిపించుకుంటుందా?

ఇక ప్రదర్శన విషయానికొస్తే, అన్నమయ్య కీర్తనాగాన కచేరీలో, స్వరకల్పనాది మనోధర్మ సంగీతాన్ని పాడవద్దని శాసించే నిర్వాహకుల్ని చూశాను నేను. నిజానికి అందుకు అనుకూలమైన కీర్తనలలో, సమర్థులైన గాయకులు, మితిమించని విధంగా ఆలాపన, స్వరకల్పన, నెరవులు వంటివి చేర్చటం వలన శ్రోతలకు కొంత విశ్రాంతి కలగటమేకాక, కళాకారుడి సృజనాత్మకత వెల్లడి అయ్యే అవకాశం ఉంటుంది. రెండు గంటల కచేరీలో మూడు, నాలుగు అంశాలలో ఈవిధమైన మనోధర్మప్రదర్శన చేయటం ఆహ్వానింపదగినదే!

నాకు ఒక సందేహం కలుగుతూ ఉంటుంది. ఎన్నడైనా త్యాగరాజస్వామి, అన్నమయ్య కీర్తన విని ఉంటారా? అవకాశమే లేదు. అయితే ఇద్దరిదీ భక్తి మార్గమే కనుక, వారిరువురి రచనలలోనూ కొండొకచో భావసారూప్యత కనబడుతుంది. ఉదాహరణకు 'అలర చంచలమైన ఆత్మలందుండనీ అలవాటు సేసెనీ ఉయ్యాల!' అని అన్నమయ్య అంటే, 'ఏతావునరా! నిలకడ నీకు? ఎంచిజూడగా నగబడవు!' అని త్యాగయ్యగారంటారు.' ఎవరని నిర్ణయించిరిరా? నిన్నెట్లారాధించిరిరా! నరవరులు!' అని త్యాగయ్యగారంటే, 'ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు' అంటారు అన్నమయ్య.

ఏది ఏమైనా, తెలుగువారిగా పుట్టటం మన అదృష్టం. అన్నమయ్య మొదలుకొని, మైసూరు వాసుదేవాచార్య వరకూ అందరూ తెలుగులోనే భగవంతుని కీర్తించారు. ఆ కీర్తనలను తనివితీరగా భావించి,పాడుకొనే వరం తెలుగువారి సొత్తు.

అన్నమయ్య సాహిత్యమే అంత గొప్పగా ఉంటే... ఇక ఆయన సంగీతమెంత గొప్పగా ఉండిఉంటుంది?ఆనాడు వాడుకలో ఉన్న రాగాలు పరిమిత సంఖ్యలోనే ఉండేవి కదా!..మరి రాగిరేకులమీద వ్రాసిన విధంగా చూస్తే, ఒకే రాగాన్ని కొన్ని వందల సంకీర్తనలకు ఆయన ఎలా స్వరపరచి పాడుకొని ఉంటారు? ఊహకు అందని విషయమది!..

అందుకే... అందరం 'అన్నమయ్యా!నీకు వందన మన్నామయ్యా!' అనవలసిందే!..

- మొదుమూడి సుధాకర్

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

ఉత్తమ వధువు

(నాకు నచ్చిన కథ)

ఒక వర్తకుడికి ఏడుగురు కుమారులు. ఆరుగురికి వివాహమైనది. కోడళ్లతో సమిష్టి కుటుంబం సజావుగా సాగిపోతూ వున్నది. ఇప్పుడు ఏడవ వానికీ పెళ్లి జరిగి నూతన వధువు ఈ ఇంట ప్రవేశించినది.

ఇంతవరకూ ఇంటిలో ఆరుగురు తోటి కోడళ్లు ఉదయం సాయంత్రం వంతులు వేసుకుని వంటలు చేస్తూ వున్నారు. ఎవరైనా సుస్తీపడితే–

"నా వంతు వచ్చినప్పుడు నీవు వంట చేయలేదు కదా! మరి నీ వంతప్పుడు నేనెందుకు చేయాలి?"

ఇలాంటి చిన్నచిన్న తగాదాలు ఈ ఇంట్లో మామూలైపోయాయి..

సరే! కొత్త కోడలుఇంట్లోకి ప్రవేశించిన మొదటిరోజే చకచకా వంటగదిలోకి వచ్చేసింది. అత్త అన్నది.

"ఇక్కడ ఆరుగురు కోడళ్లు వున్నారు. నీవిప్పుడే వంటగదిలోకి రావద్దు"

చిన్నకోడలన్నది. "అత్తగారూ! ఆకలితో అతిథి ఇంటికి వస్తే మనం ఏం చేస్తున్నాము? శుభ్రంగా అన్నం పెడుతున్నాము కదా! దానివలన మనకు పుణ్యం కలుగుతున్నది. ఒక్కరికి అన్నం పెట్టినందుకే ఇంత పుణ్యం వస్తుంటే, మరి ఇంట్లో వాళ్లందరకూ వండి వడ్డిస్తే ఇంకెంత పుణ్యం రావాలి! ఇల్లు మీది, బియ్యం మీవి, ఇంట్లో పాత్రలు మీవి. వంట పదార్థాలన్నీ మీవే! నేను కొంచెం పరిశ్రమ చేసి వంట చేసి పెడితే నాకు పుణ్యం వస్తుందా రాదా? అందరూ తిని తృప్తిపడతారు, సంతోషిస్తారు. కాబట్టి అత్తయ్యా! మీరు అలా కూర్చోండి, నేనే వంట చేస్తాను."

అత్త మనసులో అనుకున్నది.

"చిన్న కోడలు బాగా చెబుతున్నది. అందరికన్నా చిన్నది అనుకున్నాను. ఈమె బుద్ధి మంచిది."

మరునాడు తెల్లవారింది. అత్త ఉదయమే వంటగదిలోకి చొరబడి వంట చేయడానికి కూర్చున్నది. కోడళ్లు అది చూసి "అయ్యో! అత్తగారూ! మేమంతా లేమా! మీరెందుకు శ్రమపడడం, లేవండి! లేవండి" అనగానే అత్త అన్నది.

"మీరు చిన్నవాళ్లు, నేను పెద్దదాన్ని.

నేను త్వరలో మరణించవలసి వుంది. నేనిప్పుడు పుణ్యం చేసుకొనకుంటే మరెప్పుడు చేసుకుంటాను?

నా ఇంటిపని నేను చేసుకోవడం పాపమేమీ కాదు కదా! అదీకాక ఈ మాత్రం శ్రమ చేస్తే నా ఆరోగ్యంకూడా బాగుంటుంది."

నిన్న చిన్నకోడలు, ఇవాళ అత్తగారు ఇలా మాట్లాడుతూంటే కోడళ్లందరికీ లోపల ఉత్సాహం కలిగింది.

"ఈ విషయం మనం ఊహించనే లేదు. మన ఇంటి పని మనం చేసుకుని, వంట చేసి అందరకూ పెట్టడం వల్ల పుణ్యం వస్తుంది."

ఇక ఇప్పుడు ఏ కోడలు ముందు లేస్తే ఆమే వంటగదిలోకి జొరబడి పొయ్యి వెలిగించి కాయగూరలు తరగడం మొదలుపెడుతున్నారు. నేను ముందు,నేను ముందు అని తగవులు వస్తున్నాయి. ఇంటి యజమాని ఇది గమనించి "అందరూ వంతులు వేసుకుని ఆ ప్రకారం వంట చేయండి." అన్నాడు.

ఒకప్పుడేమో! 'ఇవాళ వంట నీ వంతంటే నీది' అని వాదులాడుకునేవారు. ఇప్పుడేమో ఇవాళవంట 'నేను చేస్తానంటే నేను చేస్తాననే' భావాలు వీరిమనస్సుల్లో ఏర్పడ్డాయి. కొత్త కోడలు కొంచెంఅసంతృప్తిగా వున్నది. 'తన వంతు నాలుగైదు రోజులకో మారు వస్తున్నది. ఈ ఖాళీ సమయంలో ఏంచెయ్యను' అని ఆలోచిస్తూ ఉండగా ఆమె దృష్టి మూలనున్న తిరగలిపై పడింది. దివ్యమైన ఆలోచన వచ్చింది.

మరునాడు తిరగలిని తన గదిలోకి మార్చుకుని పిండి విసరడం మొదలు పెట్టింది. అత్త ఇది గమనించింది.

"ఏమే! చిన్న కోడలా! నీవు పిండి ఎందుకు విసురుతున్నావు? మన దగ్గర డబ్బుకేమీ లోటు లేదు కదా! భగవంతుడు చాలానే ఇచ్చాడు."

ఆమె ఇలా జవాబిచ్చింది.

"అత్తయ్యా! మనకు డబ్బు చాలా వుండవచ్చుగాక! కాని నన్ను ఈ పని వద్దని మాత్రం చెప్పకండి. పిండి రోజువారీ విసురుతూనే వుంటాను. ఇలా చేతితో పిండి విసరడం వలన శరీరం సరిగా వుంటుంది. వ్యాయామం కూడా దానంతట అదే అవుతుంది. జబ్బులు రావు. పదే పదే వైద్యులవద్దకు పోనక్కరలేదు. అదీ కాక వంట చేసిన దానికంటె కూడా ఎక్కువ పుణ్యం ఈ పని వల్ల లభిస్తుంది. వంట ఎవరైనా చేస్తారు! పిండి మాత్రం నేను విసిరినదే అంతా తింటారు."

అత్త, ఆరుగురు కోడళ్ళు ఈ మాటలు శ్రద్ధగా విన్నారు. 'ఈమె సరిగానే చెబుతున్నది' అనుకున్నారు. వారు తమతమ భర్తలతో

"ఇంటికి తిరగలి కొని తెండి. నేను రేపటినుండి పిండి విసరాలి" అని చెప్పుకుని తిరగళ్లు తెప్పించుకున్నారు. అందరూ రోజువారీ రెండున్నర కేజీలదాకా పిండి విసురుతున్నారు.ఇంట్లో పిండి పేరుకుపోతున్నది. వెంటనే కొత్త కోడలు పిండిని సంచుల్లో సర్ది దుకాణంలో పెట్టి అమ్మించేసింది. బాగా లాభం వచ్చింది. అందరికీ ఆనందమైంది.

కొత్త కోడలు 'ఇంకా ఏంచెయ్యాలి?' అని ఆలోచిస్తున్నది. 'ఇంటి వెనుక నుయ్యి వున్నది. రోజూ నౌకరువచ్చి తొట్టెలోనికి నీళ్లు తోడుతుంటాడు.'

ఈమె మరునాడు త్వరత్వరగా స్నానపానాదులు ముగించుకుని నుయ్యి దగ్గరకు చేరుకున్నది. చేద తీసుకుని నీళ్లన్నీ తోడి తొట్టెలో నింపింది. కొంచెం మొక్కలకు పోసింది. నౌకరు వచ్చాడు. వాడికి పనిలేకుండా పోయింది. ఖాళీగా కూర్చున్నాడు. విషయం పెద్దవాళ్ల దృష్టికి వెళ్లింది. అత్త వచ్చినది.

"ఏమ్మా! చిన్న కోడలా! "నీవు గాని నీళ్లు తోడావా?"

"అత్తయ్యా! మీరేమీ మాట్లాడకుండా వుండండి. మీరేమైనా మాట్లాడితే నా పుణ్య సంపాదన ఆగిపోతుంది. మీరు వైశాఖ మహత్మ్యం విన్నారా లేదా? వైశాఖ మాసంలో మంచి నీళ్లివ్వడానికి సంబంధించి గొప్ప కథ వున్నది. నీళ్లిస్తే వచ్చేంత పుణ్యం– అన్నం పెట్టినందుకు లేదు. ఎందుకంటే అన్నం రోజుకు ఒకటి రెండు పర్యాయాలే కదా తింటాము! కాని నీళ్లు– నీళ్లు ప్రతిరోజూ అనేకసార్లు త్రాగుతాము. నీళ్లతో కాళ్లు చేతులు కడుక్కుంటాం, ముఖం శుభ్రం చేసుకుంటాం, స్నానం చేస్తాం ఇలా నీరు చాలా ఉపయోగపడుతుంది."

మర్నాడు అత్త పెందలకడనే లేచి నుయ్యి దగ్గరకు వెళ్లి నీళ్లు తోడి తొట్టిలో వేయసాగింది. కోడళ్లందరూ హడావిడిగా అక్కడకు చేరుకున్నారు.

"అత్తగారూ! మీరు చేసేదేమన్నా బాగున్నదా? మేమింతమంది వుండగా మీరు ఈ నూతి దగ్గరకు రావడమేమిటి? "

"మీరేమీ ప్రశ్నించకండి! నేను పెద్దదాన్నయ్యాను. అందువల్ల తొందరగా పుణ్యం సంపాదించుకోవాలి. మీరైతే వెనుకనైనా చేసుకోవచ్చు."

మరునాటి నుండి కోడళ్లు కూడా నూతి దగ్గరకు చేరి వంతులు వేసుకుని నీళ్లు తోడసాగారు. నౌకరికి ఏంచెయ్యాలో తోచలేదు. "అమ్మా! నాకు సెలవిప్పించండి." అని వెనుతిరగ్గా చిన్న కోడలు అడ్డుకొని అత్తగారితో "ఇతడిని ఉద్యోగం మానిపించవద్దు. షాపులో వేరే పని అప్పగిద్దాం!" అన్నది.

"చిన్నకోడలి మంచితనం" తెల్సుకుని అత్త చాలా సంతోషించింది.

చిన్న కోడలు ఇప్పుడు మళ్లీ ఆలోచనలో పడింది. "ఇంట్లో అందరూ వంటలు చేస్తున్నారు. పిండి విసురుతున్నారు. నీళ్లు తోడుతున్నారు. ఇక నేనేం చేయాలి?"

ఒకనిర్ణయానికి వచ్చింది.

తరువాతిరోజు ఉదయాన్నే వంట గది చేరుకుని అంట్లు ముందేసుకుని బూడిద చేతిలోకి తీసుకుని మూల కూర్చున్నది. పనిమనిషి విస్తుపోయి అలాగే నిలబడిపోయింది. గబగబా అత్తగారు వచ్చింది.

"ఏమే! నా ముద్దుల కోడలా! ఇది మాత్రం నీకు తగదు. మనకుపనిచేసే వాళ్లున్నారు. అంట్లు తోమడం వల్ల నీ బట్టలు ఖరాబవుతాయి. నీ నగలు అరిగిపోతాయి." అని సున్నితంగా మందలించింది. దానికి చిన్న కోడలు "అత్తయ్యా! నన్ను కాస్సేపు మాట్లాడనివ్వండి. ఎంగిళ్లెత్తడంలో గొప్ప మాహాత్మ్యము వున్నది. మీరు మహాభారతంలో కథ వినలేదో! పాండవులు రాజసూయాగం చేస్తూ శ్రీకృష్ణుణ్ని ప్రథమంగా పూజ చేసిన విషయం తెలుసు కదా! ఆ కృష్ణ భగవానుడే అక్కడ అందరియెంగిలి విస్తళ్లు ఎత్తేపని చేసాడు తెలుసా! ఎంగిళ్లెత్తటమనేది ఎంత మహిమాన్వితం కాకపోతే భగవంతుడీ పనెందుకు చేస్తాడు?"

తర్వాత రోజు అత్తవచ్చి వంటింట్లో తిష్ట వేసి అంట్లు ముందేసుకుంది. ఈ వింత చూసి కోడళ్లందరూ చుట్టుముట్టారు. వెంటనే చిన్న కోడలు

"అత్తయ్యా! ఇలా నా పని మీరు తీసుకోవడం సమంజసం కాదు. ఇదిగో! ఈ పళ్లెం, చిన్న గ్లాసుపై నాకే హక్కు వున్నది. ఎందుచేతనంటే – ఇవి నా పతిదేవుడివి. కనుక వీటిని నేను తోముతాను." అంది. దానికి అత్తగారు "వెళ్లు వెళ్లు! వీడు ముందు నా కొడుకు, తర్వాతనే నీకు భర్త అయ్యాడు.కాబట్టి వీటిని నేనే తోముతాను." ఈ విధంగా అని గబగబా అంట్లు తోమసాగింది. ఇది చూసి కోడళ్లందరూ కూర్చుని వాళ్లూ అంట్లు కడగడం ప్రారంభించారు.

"ఇప్పుడు నేనేంచెయ్యను? అని చిన్న కోడలు ఆలోచనలో పడింది. రోజూ ఉదయం ఇల్లు తుడవడానికి నౌకరు వస్తూంటాడు కదా!అనుకుని వేకువకాగానే లేచి చీపురు పట్టింది. నౌకరు వచ్చేముందుగానే గదులన్నీ ఊడ్చిపారేసింది. అత్త గారిది చూసి " చిన్న కోడలా! ఇల్లు నువ్వు తుడిచావేమిటి? అని అడగ్గా కోడలు–

"అత్తయ్యా! మీరు కాస్సేపు ఊరుకోండి. మారు మాట్లాడకండి. మీరు మాట్లాడారంటే నా చేతిలో పనిపోతుంది అని ఇంకా ఇలా అన్నది.

"మీరు రామాయణం వినలేదా! అడివిలో గొప్ప గొప్ప ఋషులు, మునులు వుండగా శ్రీరాముడు వారి కుటీరాలకు వెళ్లకుండా ముందుగా శబరి కుటీరానికే వెళ్లాడు. ఎందుకో తెలుసాండీ ?శబరి రోజూ పంపాసరోవరానికివెళ్లే దారిలో రాళ్లూరప్పలని తొలగించి ఋషులకు దారిఏర్పాటు చేసి వారికి సేవలు చేసేది. ఈ సేవలో గొప్ప మహిమ వున్నది."

మర్నాటినుండి కోడళ్లందరూ చీపుర్లు పట్టారు. ఈ విధంగా ఇంటి స్వభావం పూర్తిగా మారిపోయింది. అందరూ ఉదయాన్నే లేచి ఎవరి పనుల్లో వారు మునిగిపోతున్నారు. శుభ్రంగా గదులు తుడుస్తున్నారు. నీళ్లు తోడుతున్నారు. అంట్లు శుభ్రపరుస్తున్నారు. వంటలు వండు కుంటున్నారు. అంతా సవ్యంగా జరిగిపోతున్నాయి. కోడళ్లందరూ అన్యోన్యంగా ఉంటున్నారు. అత్తామామలను గౌరవంగా చూసు కుంటున్నారు. దుబారా ఖర్చులు తగ్గిపోయాయి. యజమాని వ్యాపారంలో లాభం పెరిగింది. వెంటనే మామగారు కోడళ్లందరికీ నగలు చేయించారు.

ఒకరోజు చిన్న కోడలు తనకు మామగారిచ్చిన నగలు తీసుకుని పెద్ద కోడలు వుంటున్న గదిలోనికి వెళుతూండగా అత్త చూసింది.

చిన్న కోడలు పెద్ద కోడలితో ఇలా అంటున్నది.

"అక్కా! మీకు ఆడపిల్లలు వున్నారు. వారు పెరుగుతున్నారు. రేపో, మాపో వారికి పెళ్లిళ్లు చేయాలి. నాకైతే ఇంకా పిల్లలు లేరు.అందు వల్ల ఈ నగలు నేనేం చేసుకోను? మా అమ్మానాన్న నాకు నగలు బాగానే పెట్టారు. అవన్నీ నాదగ్గర ఇనప్పెట్టెలో పడి వున్నాయి. కాబట్టి ఈ నగలు నువ్వే తీసుకో! పిల్లల పెళ్లిళ్లకి అక్కరకొస్తాయి." అని ఆమె చేతిలో పెట్టింది. గుమ్మం బయట నుండి ఇదంతా గమనిస్తున్న అత్త ఒక్కసారిగా చలించి పోయింది.

కొసమెరుపు: ఉపన్యాసాలు చెప్పడం వేరు. ఆచరణలో చూపడం వేరు. ఈ కొత్త కోడలు తాను చెప్పినది ఆచరణ చేసి చూపించింది. ఇంటిని సంస్కరణ బాటలోకి నడిపించింది.

(వివేక చూడామణి.) స్వామీజీ వ్రాసిన పుస్తకం నుండి సేకరణ

మహారాజశ్రీ 'ప్రముఖాంధ్ర' పఠితలారా!

అభివందనములు. ప్రముఖాంధ్ర ఈ నెలతో - 25 సంవత్సరాలు పూర్తి అయ్యింది. అనగా ఈ సంచిక 300వ మాసపు 300వ సంచిక. ఇంతవరకూ నూటికి 90 మంది 'ప్రముఖాంధ్ర'ను ఉచితంగా అందుకుంటూనే ఉన్నారు. విదేశాలకు 'ప్రముఖాంధ్ర' పంపించడానికి రూ. 60/-లు వ్యయమగుచున్నది. పత్రిక మూల్యం రూ. 20/-లు అవుతున్నది. తెలుగు భాషకు సేవ చేస్తున్న మామీద ఇంకనూ ఇంత ఆర్థిక భారం మోపడం ధర్మమేమో మీరే ఆలోచించండి.

తెలుగువారిలో ఎంతోమంది శ్రీమంతులూ, ఉదారులూ ఉన్నారు. ప్రకటనరీత్యా, విరాళముల ద్వారానూ సహకరించవచ్చును. రూ. 25,116, రూ. 15,116/-, రూ. 10,116, రూ. 5,116లూ రూ. 2,116లు అభిమాన చందాగా పంపండి.

ఏవీ లేకపోయినప్పటికినీ నెలకొక రూ. 20ల్నూ, సాలుకు రూ. 200/-లు పంపండి. ఇంత కూడా పంపలేనివారు మా పఠితల్లో ఉండరని మా విశ్వాసం. అందరికీ ఇదే మా అభ్యర్థనం.

- గోటేటి వెంకటేశ్వరరావు

జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

సత్యాన్ని త్రికరణశుద్ధిగా నమ్మితే విజయం తథ్యం.

- స్వామి వివేకానంద

స్వామి వివేకానంద సూక్తులను తీసుకుని జీవీ రావ్ పేజి రాయడం మొదటి నుండి నా అలవాటు, అంతలా ఆయన నన్ను ప్రభావితం చేసారు.

ధృఢసంకల్పం, పవిత్ర ఆశయం, తప్పకఫలితాలను ఇస్తాయి – అన్న వివేకానందుని సూక్తి ప్రముఖాంధ్ర విషయంలో నూటికినూరుపాళ్ళు వర్తిస్తుంది. 25 సంవత్సరాల క్రితం ఒక సదుద్దేశంతో పత్రికను ప్రారంభించారు నాన్నగారు. భారతదేశంలో హిందీ తరువాత ఎక్కువగా మాట్లాడే భాష తెలుగు, మనలో ఎంతోమంది గొప్పవారున్నారు, మన భాష సుందరమైనది, సుమధురమైనది. మన జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య, ఉపాధ్యాయదినోత్సవం జరుపుకునే రోజు రాధాకృష్ణన్‌గారి పుట్టినరోజు. జాతీయకవి తమిళుడు అయిన సుబ్రహ్మణ్య భారతి మెచ్చుకున్న సుందర తెలుగు మనది. అట్టి తెలుగు భాష, తెలుగువారిని గురించి ప్రపంచంలో వున్న తెలుగువారికి తెలియపరచాలనే సదుద్దేశంతో పాతికేళ్ళక్రితం

ప్రపంచ తెలుగు సమాఖ్య, తెలుగు మహాసభల వేదిక మీద ప్రారంభింపబడిన మాస పత్రిక ప్రముఖాంధ్ర. ఈ సంచికతో 25 సంవత్సరాలు, 300 మాసములు పూర్తి చేసుకుంది. ఈ బృహత్కార్యాన్ని శ్రీ గోటేటివారు తన స్వశక్తిని నమ్ముకుని వొంటిచేత్తో నడిపారు. ఇందులో ఆయన స్వలాభం కించిత్తు లేదు, పైగా ఆర్థిక వొడిదుడుకులే ఎక్కువ, ఆయన చేపట్టిన కార్యం మంచికార్యం కనుక కొంతమంది ఆయన మిత్రులు తాము వున్నామంటూ కొంత భాగం ప్రకటన రూపంలో సహాయం చేశారు. నాన్నగారు 24 సంవత్సరాలుగా శ్రమపడి తీసుకువచ్చిన పత్రిక ఆగిపోకూడదని నేను ఆ భాద్యతను తీసుకుని ఈ 25 సంవత్సరం 12 నెలలు 12 పత్రికలు తీసుకుని వచ్చాను. నాన్నగారి మిత్రుల సహాయ సహకారం వుంటుందనే నమ్మకం నాకుంది. నాన్నగారి ఆశీస్సులతో పత్రికను కొనసాగించగలననే నమ్మకంతో 2020లో అడుగు ముందుకేస్తున్నాను.

– మీ **గోటేటి వెంకటేశ్వరరావు**

అంగరంగ వైభవం.. ఆదర్శ దంపతుల షష్టిపూర్తి మహోత్సవం



ఆత్మీయులు బంధువులు స్నేహితుల మధ్య సంబరంగా జరిగిన నా షష్ట్యబ్దపూర్తి. భావోద్వేగానికి లోనయ్యి నేను రాయలేకపోయాను. నూతన సంవత్సరంలో కొన్ని బొమ్మలతో విశేషాలతో మీతో పంచుకుంటా. ప్రస్తుతం తమ్ముడు శ్రీకాంత్ పంపిన ముచ్చటైన నాలుగు వాక్యాలను మీతో పంచుకుంటున్నాను.

ఆ ఇద్దరిదీ ... ఒకేబాట ... ఒకేమాట...

ఒకరు ఇంటికి వెలుగైతే మరొకరు ఆ వెలుగును అందించే దివ్వె..

తండ్రి మాటే వేదంగా భావించే శ్రీరాముడు అతడైతే.. భర్త అడుగుజాడలలో నడుస్తూ కష్టసుఖాలలో పాలుపంచుకునే సీతమ్మ ఆమె..

అందుకే ఆ జంటను చూసిన వారెవరైనా అర్ధనారీశ్వర తత్వానికి అసలుసిసలు నిర్వచనం అంటారు.

మరి ఆ జంట షష్టిపూర్తి వేడుక అంటే ఎలా ఉండాలి? ఎంత ఘనంగా, అంగరంగ వైభవంగా జరగాలి?? ఎంత హడావుడి ఉండాలి?? ఎన్ని సరదాలు ఉండాలి?? నాతో సహా చాలామందికి ఇలా ఎన్నో అంచనాలు ఉండే ఉంటాయి. ఆ అంచనాలను అందుకుంటూ, ఇంకా చెప్పాలంటే అంతకు మించి వైభవంగా జరిగింది మా గోటేటన్న, లలిత వదినమ్మ షష్టిపూర్తి మహోత్సవం.

ఏడు కొండల వేంకటేశ్వరుడి ఆశీస్సులు..

స్వర్గీయ శ్రీమతి & శ్రీ గోటేటి రామారావు గారి దీవెనలు..

రెండు రోజులు...

శాస్త్రోక్తమైన పూజలు...

వేదపండితుల మంత్రోచ్ఛారణలు..

తిరుమల నుండి ప్రత్యేకంగా వచ్చిన అర్చక మిత్ర బృందం ఆశీర్వాదాలు...

తమ్ముళ్ళు, కూతుర్లు, ముఖ్యంగా అన్నీ తానై దగ్గరుండి అల్లుడు చేసిన పండగ...

గోటేటన్న గారాల పట్టీ, మనవరాలు ఆద్య చేసిన సందడి..

బంధువుల కోలాహలం...

వేదికకు ఒకవైపు గోటేటన్న బాల్యమిత్రుల సరదాలు...

మైలాపూర్ సాయిబాబా అనుగ్రహంతో కురిసిన అభిమాన పూర్వక పూలవాన...

ఫోటో గ్రాఫర్ చెప్పినట్టు పోజులిచ్చేటప్పుడు గోటేటన్న మోములో సిగ్గు..

పంచభక్ష్య పరమాన్న భోజనం...

ఇలా ఎంతో ఘనంగా జరిగిన ఉత్సవం దగ్గరుండి చూసిన నాలాంటి వారికి అదో కన్నుల పండగ!

నా షష్ట్యబ్ధపూర్తి సందర్భంగా నేనందుకున్న ఆశీస్సులు

గోటేటి వేంకటేశ్వర రావు
- పితృభక్తి పరాయణుడు
- సౌశీల్య వంతుడు
- ప్రతికూల పరిస్థితులకు వెరవని ధీశాలి
- ఆలోచనాపరుడు
- ఓర్పరి
- నేర్పరి
- స్నేహశీలి
- చమత్కారి
- హాస్యప్రియుడు

షష్టి పూర్తి జరుపుకుంటున్న ఈ చిరంజీవి పూర్ణాయుష్కుడై, సకల సంపదలతో, కీర్తి ప్రతిష్ఠలతో వెలుగొందాలని, అతని తండ్రి కీ॥శే॥ గోటేటి శ్రీరామారావు గారు పుత్రోత్సాహముతో అతనిని, అతని కుటుంబాన్ని దీవించాలని అభిలషిస్తూ...

శుభాకాంక్షలు! శుభాశీస్సులు!!

– బోరంచ మనోహర్,

అపర్ణ సరోవర్, హైదరాబాదు

చిరంజీవ చిరంజీవ జీవితపయనం...

అదెవరిదైనా... ఇద్దరి తల్లుల మధ్య ప్రయాణం. కన్నతల్లి కడుపులో నుండి నేలతల్లి ఒడిలోకి వస్తాం. నూరేళ్లపాటు భగవంతుని యీ అతిథిగృహంలో ఆటలాడుతూ పాటపాడుతూ, నవ్వుతూ, ఏడుస్తూ గెలుస్తూ, ఓడిపోతూ క్షణక్షణానికీ సమస్యల్లో ఆటుపోట్లనో ఎదుర్కుంటూ, అలసిపోతూ, మళ్ళీ పుంజుకుంటూ అనంతంలా అనిపించే పయనాన్ని సాగిస్తూనే ఉంటాం.

అరవై సంవత్సరాలంటే ఓ ఆవర్తం
కాలం చక్రంలా తిరుగుతూనే ఉంటుంది.
రోజుల మాలలు అల్లుకుంటూ
అనుభవాల పరిమళాల్ని జల్లుకుంటూ
ఏమిటీ ప్రత్యేకతా?

పసిబిడ్డగాపుట్టి, బోర్లపడటానికి చేసే సాధన ఎంత గొప్పదీ, ఎంత క్లిష్టమైనదీ–

మోకాళ్ళ చిప్పలు అరిగేలా పాకుతూ, నిలబడటానికి చేసే ప్రయత్నం తక్కువదా?

ఆ తరువాత నడక, పరుగు, జీవనపథంలో అడుగడుగునా ఒడిదుడుకులే.

అన్నిటినీ ద్విగ్విజయంగా దాటుకుంటూ నాటి ఎవరెస్ట్ శిఖరంమీద టెన్సింగ్‌లా 60 సంవత్సరాల విజయబావుటాని జీవన శిఖరం మీద ఎగురవేశారు సోదరుడు శ్రీ గోటేటి వేంకటేశ్వరరావు.

సోదరా, మిమ్మల్ని తలచుకున్న క్షణమే గుర్తొచ్చేది పూజ్యులు, అజాతశత్రువు, అందరి బంధువూ శ్రీగోటేటి శ్రీరామారావుగారే, సర్వకాలసర్వావస్తల్లోనూ వారు మీ వెంటే ఉంటారు మానసికంగా, ఆత్మరూపిగా!

సోదరా, అందరినీ వేయికళ్ళ కాచే ఆ పరమేశ్వరి మిమ్మల్ని మీ కుటుంబాన్నీ అరచేతుల్లో పెట్టుకుని కాపాడాలనీ, కుటుంబమంతా నిండు నూరేళ్ళూ ఆయురారోగ్య ఐశ్వర్య ఆనందాలతో వర్ధిల్లాలనీ, మీ తల్లిదండ్రుల ఆశీస్సుల నీడలో మీ జీవిత పయనమంతా హాయిగా చల్లగా సాగిపోవాలనీ మనఃస్ఫూర్తిగా ఆ భగవంతుడ్ని కోరుకుంటూ–

ఈ షష్ట్యబ్ది ఉత్సవం అద్భుతంగా జరగాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ...

మీ భువనచంద్ర

'ప్రముఖాంధ్ర' రజతోత్సవ సంచిక పుష్కల విశేషములతో అలరారేట్టు రావడంలో పరితుల తోడ్పాటు కోరుతూన్నాం.